
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 21 ఆగస్టు 2025



టీమిండియా మేనేజర్‌గా ప్రశాంత్



విశాఖపట్నం, స్పోర్ట్సు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆసియా కప్ క్రికెట్ టోర్నీలో పాల్గొనే భారత్ జట్టు మేనేజర్‌గా విశాఖకు చెందిన ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) మాజీ ఉపాధ్యక్షుడు వీవీఆర్ ప్రశాంత్ నియమితులయ్యారు. సెప్టెంబరు తొమ్మిది నుంచి దుబాయ్, అబుదాబిలో ఆసియా కప్ క్రికెట్ టోర్నీ జరగనున్నది. టీమిండియాకు మేనేజర్‌గా నియమితులైన ప్రశాంత్‌ను ఏసీఏ అధ్యక్ష, కార్యదర్శులు కేశినేని శివనాథ్ (నాని), సానా సతీష్‌బాబు అభినందించారు.

కోడి వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని మేయర్ ఆదేశం

మేయర్ X కమిషనర్

- రోజులు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- కమిషనర్ వద్దనడంతోనే అధికారులు వెనుకాడుతున్నారని పీలా అనుమానం
- అంతకుముందు జోన్‌ల వారీగా సమావేశాలపై విభేదాలు
- మేయర్‌కు కమిషనర్ నుంచి అందని సమాచారం
- అందుకే కూటమి కార్పొరేటర్లు గైర్హాజరు?
- తాజా పరిణామాలను స్థానికంగా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ మధ్య విభేదాలు తారస్థాయికి చేరినట్టు ప్రచారం జరుగుతోంది. తనకు కమిషనర్ తగిన గుర్తింపు ఇవ్వడం లేదని పీలా శ్రీనివాసరావు భావిస్తున్నారు. తాజాగా కోడి వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తూ పట్టుబడిన వాహనాలపై కేసులు నమోదు చేయాలని మేయర్ స్వయంగా అధికారులను ఆదేశించారు. అయినా ఇంతవరకూ కేసులు నమోదుచేయలేదు. అందుకు కమిషనరే కారణమని మేయర్‌తోపాటు టీడీపీకి చెందిన కార్పొరేటర్లు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. కమిషనర్ తీరును కూటమి ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలని యోచిస్తున్నారు.



రెండు నెలల కిందట కేతన్‌గార్గ్ జీవీఎంసీ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆదిలో మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లతో సఖ్యతగానే ఉన్నారు. ఆ తర్వాత నెమ్మదిగా వారి మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. తమను కమిషనర్ కనీసం పట్టించుకోవడం లేదని, సమస్యలు చెప్పుకోవడానికి వెళితే గంటల తరబడి నిరీక్షించేలా చేస్తున్నారంటూ కార్పొరేటర్లు బహిరంగంగానే ఆరోపించారు. దీనిపై మేయర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కమిషనర్ జోన్‌ల వారీగా కార్పొరేటర్లు, అధికారులతో సమావేశాలు ఏర్పాటుచేయనున్నట్టు ప్రకటించారు. ముందుగా గత నెల 19న భీమిలి జోన్‌లో తొలిసమావేశం నిర్వహించారు. ఆ తర్వాత మిగిలిన జోన్‌ల వారీగా సమావేశాలకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. అయితే దీనిగురించి కనీసం తనకు సమాచారం ఇవ్వలేదని మేయర్ పీలా శ్రీనివాసరావు అధికారులతో పాటు కార్పొరేటర్ల వద్ద తన అసంతృప్తిని వ్యక్తంచేసినట్టు తెలిసింది. మేయర్‌కు తెలియకుండా జోన్‌ల వారీగా కార్పొరేటర్లతో సమావేశాలు పెట్టడం అంటే తనను కించపరచడమేనని పీలా ఆవేదన వ్యక్తంచేశారు. అలాంటి ... మిగతా 6వ పేజీలో

కిక్కిరిస్తున్న బస్సులు

'స్త్రీశక్తి' పథకం అమలుతో పెరిగిన ఆక్యుపెన్సీ

- గతంలో 62 శాతం, ఇప్పుడు 72 శాతం
- పెరిగిన 10 శాతం మహిళలే అంటున్న అధికారులు
- విశాఖ రీజియన్‌లో పథకం వర్తించే బస్సులు 570
- వాటిల్లో రోజుకు సుమారుగా 1,78,000 మంది ప్రయాణం
- అందులో మహిళలు 98 వేల మంది



ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తూ జీరో ఫెయిర్ టికెట్ చూపిస్తున్న మహిళలు

ద్వారకా బస్‌స్టేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): 'స్త్రీశక్తి' పథకం అమలుతో ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ గణనీయంగా పెరిగింది. జిల్లాలో గల ఏడు డిపోల్లో 804 బస్సులు ఉండగా...అందులో ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు 570. ఈ బస్సులన్నింటిలో మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతిస్తున్నారు. ఈ నెల 15వ తేదీన పథకం ప్రారంభానికి ముందు ఈ 570 బస్సుల్లో సగటు ఆక్యుపెన్సీ రేషియా 62 శాతం ఉండేది. ప్రస్తుతం 72 శాతానికి పెరిగింది. గడిచిన నాలుగు రోజుల్లోను ఇదే ఓఆర్ కొనసాగుతుంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు మహిళలు ఆసక్తి చూపడంతో ఇలా ఓఆర్ పెరిగిందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. స్త్రీశక్తి పథకం అమలుకు ముందు ఆర్టీసీ విశాఖ రీజియన్‌లోని ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లలో రోజుకు 1.6 లక్షల మంది ప్రయాణించేవారు. అందులో 80 వేల మంది మహిళలు ఉండేవారు. ఆగస్టు 15న స్త్రీశక్తి పథకం ప్రారంభించిన తరువాత ప్రయాణికుల సంఖ్య 1.76 లక్షల నుంచి 1.8 లక్షల మంది వరకూ ఉంటుండగా, అందులో మహిళా ప్రయాణికుల సంఖ్య 98,000.



మద్దిలపాలెం డిపో వద్ద ఆర్టీసీ బస్సులో మహిళలు

ఆ ఐదు రూట్లలో అధిక ఓఆర్

ఆధ్యాత్మిక, పర్యాటక స్థలాలకు సంబంధించిన రూట్లలో నడుస్తున్న బస్సుల్లో ఎక్కువ ఓఆర్ నమోదవుతోంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సింహాచలం, వన్‌టౌన్, ఆర్‌కే బీచ్, అనకాపల్లి, అన్నవరం ప్రాంతాలకు రాకపోకలు సాగించే బస్సుల్లో సోమ, మంగళ, బుధవారాల్లో 80 శాతానికిపైగా ఆక్యుపెన్సీ రేషియో ... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీలో ఈట్ రైట్ క్యాంపైన్

- హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, వీధి విక్రయ దుకాణాల్లో శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ విస్తృత తనిఖీలు
- ఆహార ఉత్పత్తుల్లో నాణ్యత పాటించకుంటే కఠిన చర్యలు
- కల్తీకి పాల్పడినా, నిషేధిత ప్లాస్టిక్ వినియోగించినా సీజ్ చేస్తాం
- కమిషనర్ కేతన్‌గార్గ్ హెచ్చరిక



ఫుడ్ పాయింట్ల వద్ద తనిఖీ చేస్తున్న ఎస్‌హెచ్ఈ టీమ్

వెంకోజీపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణ దిశగా జీవీఎంసీ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 'ఈట్ రైట్ క్యాంపైన్' పేరుతో ఎస్‌హెచ్ఈ (శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్) టీమ్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ టీమ్‌లు అన్ని జోన్లలోని హోటళ్లు, ఇతర ఆహార పదార్థాలు విక్రయించే దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఆహార ఉత్పత్తుల్లో నాణ్యత, పరిశుభ్రత పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. నగరంలోని ప్రతి జోన్... మిగతా 6వ పేజీలో

యాజమాన్యం వివాదాస్పద నిర్ణయం

ఉక్కులో ప్రైవేటు క్యాంటీన్లు మూసివేత!

- దశాబ్దాల కిందట ఏర్పాటు
- విద్యుత్, నీరు ఉచితంగా ఉపయోగించుకుంటున్నాయని ఇప్పుడు క్లోజ్
- నేటి నుంచి కార్మికులు టీ తాగాలన్నా కష్టమే
- పరిమిత సంఖ్యలోనే అధికారిక క్యాంటీన్లు
- అక్కడకు వెళ్లిరావాలంటే అరగంటకుపైగా సమయం పట్టే అవకాశం
- ప్రస్తుత తరుణంలో విభాగాధిపతులు పర్మిషన్ ఇచ్చే అవకాశం లేదనే వాదన



స్టీల్‌ప్లాంట్‌లో మూతపడిన ప్రైవేట్ క్యాంటీన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్ ప్లాంటులో కార్మికుల కోసం నిర్వహిస్తున్న 210 ప్రైవేటు క్యాంటీన్లను బుధవారం యాజమాన్యం పూర్తిగా మూసివేయించింది. దాంతో అక్కడ పనిచేసే వేలాది మందికి తాగడానికి టీ, తినడానికి టిఫిన్ కూడా లభించని పరిస్థితి ఏర్పడింది. ఇది ఎవరి నిర్ణయమో...ఎందుకు ఇలా కార్మికులను వేధిస్తున్నారో అర్థం కావడం లేదని నాయకులు వాపోతున్నారు.

స్టీల్ ప్లాంటు 20 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. మొత్తం 72 విభాగాలు ఉన్నాయి. ఇది అతి పెద్ద పరిశ్రమ కావడంతో విభాగాలన్నీ ఒక దానికి మరొకటి సంబంధం లేకుండా దూరంగా ఉంటాయి. ఒక విభాగం కార్మికులు మరో విభాగానికి ఏదైనా పనిపై వెళ్లాలంటే కనీసం కిలోమీటరు దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అధికారికంగా ఉద్యోగుల కోసం స్టీల్‌ప్లాంటు ఏర్పాటుచేసిన క్యాంటీన్లు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. కార్మికులు వేల సంఖ్యలో ఉన్నారు. రెండు, మూడు గంటలు పనిచేశాక అలసిపోయి టీ లేదా కాఫీ తాగాలని లేదా ఆకలైతే ఏదైనా తినాలని అనుకుంటారు. అటువంటి వారి కోసం కొన్ని దశాబ్దాల క్రితం ఆయా విభాగాధిపతుల సిఫారసుతో ప్రైవేటు క్యాంటీన్లు ఏర్పాటుచేశారు. ఒక్కొక్కరికి 50 నుంచి 70 గజాల స్థలం కేటాయించగా అందులో టీ దుకాణాలు, టిఫెన్ సెంటర్లు, జ్యూస్ స్టాల్స్ పెట్టుకొని నడుపుతున్నారు. వాటిలో ఒక్కో దాంట్లో నలుగురైదుగురు ఉపాధి పొందుతున్నారు. అయితే ఆ క్యాంటీన్లు స్టీల్ ప్లాంటు భూమిని ఉచితంగా ఉపయోగించుకుంటున్నాయని, విద్యుత్, నీరు కూడా వాడుకుంటున్నాయని, అందువల్ల తక్షణమే వాటిని మూసేయాలంటూ ఈ నెల మొదటి వారంలో అందరికీ యాజమాన్యం నోటీసులు ఇచ్చింది. దీనిపై కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యంతో చర్చించేందుకు ప్రయత్నం చేశారు. ఆయా క్యాంటీన్ల వల్ల కార్మికులకు ఉపయోగం ఉందని, వాటిని తీసేస్తే వారంతా ఇబ్బంది పడతారని చెప్పాలని ... మిగతా 6వ పేజీలో

1,579 మంది అనర్హులు

దివ్యాంగ పింఛనుదారుల రీవెరిఫికేషన్‌లో అధికారుల నిర్ధారణ

- ఆగస్టు నుంచి పెన్షన్ నిలిపివేత
- అందులో వివిధ కేటగిరీల కింద 307 మందికి పునరుద్ధరణ

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో దివ్యాంగుల కేటగిరీలో పింఛన్లు తీసుకుంటున్న వారిలో 1,579 మంది అనర్హులు ఉన్నట్టు అధికారులు తేల్చారు. వారికి ఆగస్టు నెలకు సంబంధించి పింఛన్ నిలిపివేశారు. అయితే తామంతా 40 శాతం, అంతకంటే ఎక్కువ వైకల్యంతో బాధపడుతున్నా అనర్హులుగా పేర్కొనడం భావ్యం కాదని పింఛన్లు రద్దయినవారు వాపోతున్నారు.

సామాజిక పింఛన్లు తీసుకుంటున్న వారిలో అనర్హులు ఉన్నారన్న ఫిర్యాదులతో ప్రభుత్వం ప్రత్యేక సర్వేకు ఆదేశించింది. ముఖ్యంగా దివ్యాంగులు, వైద్య సహాయం కోటా కింద పింఛన్లు తీసుకునే వారిని తనిఖీ చేయాలన్న ఆదేశాలతో గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో 312 మంది ప్రతినెలా రూ.10 వేల నుంచి రూ.15 వేలు, మరో 12,306 మంది ప్రతి నెల రూ.6 వేలు పింఛన్ తీసుకుంటున్నారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో తలసేమియా, డయాలసిస్, కిడ్నీ మార్పిడి, 100 శాతం అంగవైకల్యం, పూర్తిగా మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు పింఛన్ ఇస్తున్నారు. అయితే గత ఏడాది ప్రభుత్వ ఆదేశాల మేరకు 312 మంది పింఛన్‌దారులకు వైద్య పరీక్షలు నిర్వహించి నివేదిక ప్రభుత్వానికి పంపారు. కానీ ఇంతవరకూ వారిలో అనర్హులు ఉన్నారా? లేదా అనే దానిపై నిర్ణయం తీసుకోనందున వారికి యథావిధిగా ప్రతినెల రూ.15 వేల వంతున పింఛన్ వస్తోంది. కాగా ప్రతి నెల రూ.6 వేల వంతున పింఛన్ తీసుకునే 12,306 మందికి గత ఏడాది డిసెంబరు నుంచి దశల వారీగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. జూలై వరకు దాదాపు పది వేల మందికి కేజీహెచ్, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ఈఎన్‌టీ ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టారు. అందులో 1,579 మంది 40 శాతం కంటే తక్కువ అంగవైకల్యం ఉన్నట్టు వైద్యుల బృందం తేల్చింది. జీవీఎంసీ పరిధిలో 1178 మంది, నాలుగు గ్రామీణ ... మిగతా 6వ పేజీలో

టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అంకురార్పణ

విజయవాడ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

- నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో గేమ్ ఛేంజర్: కలెక్టర్
- రాష్ట్రాభివృద్ధికి దోహదం: ఎమ్మెల్యే పల్లా
- మరింత పెరగనున్న విశాఖ బ్రాండ్ ఇమేజ్: ఎమ్మెల్యే గణబాబు





విశాఖలోని 'ది డెక్'లో టాటా ఇన్నోవేషన్ హబ్ విశాఖ కేంద్రాన్ని బుధవారం వర్చువల్‌గా సీఎం చంద్రబాబు విజయవాడలో ప్రారంభించగా, కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్, మేయర్ పీలా (ఇన్‌సెట్‌లో) చంద్రబాబు

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఏర్పాటుచేసిన టాటా ఇన్నోవేషన్ హబ్‌లో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన నూతన భవనం 'ది డెక్'లో టాటా ఇన్నోవేషన్ హబ్ విశాఖ కేంద్రాన్ని బుధవారం విజయవాడ నుంచి వర్చువల్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, తదితరులు పాల్గొనగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ కేంద్రం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో గేమ్ ఛేంజర్ అవుతుందన్నారు. యువతకు కొత్తగా ఎన్నో చేయాలని ఉత్సాహం ఉంటుందని, వాటిని ఆచరణలోకి తీసుకురావడానికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. వారికి అవసరమైన ప్రోత్సాహం ఈ కేంద్రం అందిస్తుందన్నారు. దీనిని అన్నివిధాలుగా ముందుకు తీసుకువెళ్లడానికి నిర్వహణలో విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, అధికారులను భాగస్వాములుగా చేశామన్నారు. నాలెడ్జ్ భాగస్వాములుగా గీతం యూనివర్సిటీ, ఐఐపీఈ, పారిశ్రామిక భాగస్వాములుగా జీఎంఆర్, దివీస్, ఆర్సెలర్ మిట్టల్ ఉంటాయన్నారు. ఈ కేంద్రం సీఈఓగా రవి ఈశ్వరపు, కన్వీనర్‌గా జాయింట్ కలెక్టర్ వ్యవహరిస్తారన్నారు. సచివాలయాలకు చెందిన 20 మందిని సిబ్బందిగా సమకూర్చామన్నారు. ఐటీ సంస్థలు, ఫ్యాక్టరీస్ విభాగాల నుంచి కూడా అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ఈ హబ్ కొత్త దిశను చూపిస్తుందన్నారు. గ్లోబల్ స్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. విప్, ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, ఈ హబ్‌తో విశాఖ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరుగుతుందన్నారు. ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. ఎమ్మెల్సీ ... మిగతా 6వ పేజీలో



ఒరిగిపోయిన భవంతి

వన్‌టౌన్‌లో ఒరిగిన భారీ భవనం

పక్కనున్న ఫంక్షన్ హాల్ కూడా...

- బీటలు వారిన పిల్లర్లు
- స్థానికుల ఆందోళన
- జీవీఎంసీ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు
- అనుమతులు లేకుండా అదనపు అంతస్థులు చేపట్టినట్టు నిర్ధారణ

మహారాణిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లోని వెలంపేట పోస్టాఫీస్‌కు కూతవేటు దూరంలో గల పువ్వల వీధిలో బుధవారం రాత్రి ఐదు అంతస్థుల భవనం పక్కకు ఒరిగింది. దాంతో అందులో నివసిస్తున్న కుటుంబాలవారు, స్థానికులు భీతిల్లారు. జీవీఎంసీ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించడంతో వారంతా హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. ఆ భవంతిలో నివాసం ఉంటున్న వారిని అధికారులు వెంటనే ఖాళీ చేయించారు. రెండేళ్ల క్రితం నిర్మించిన ఈ జీ+5 బిల్డింగ్ (కశిరెడ్డి ప్లాజా)లో పది కుటుంబాలవారు నివాసం ఉంటున్నారు. ఆ పక్కనే మూడేళ్ల క్రితం మరో భవంతి (దరణి ఫంక్షన్ హాల్) నిర్మించారు. ఈ రెండూ అనుమతులకంటే ఎక్కువ అంతస్థులు నిర్మించారు. కొద్దిరోజుల క్రితం కశిరెడ్డి ప్లాజా బిల్డింగ్ కుడి వైపున ఉన్న ఫంక్షన్ హాల్ బిల్డింగ్ పైకి వాలింది. ఇటీవల వర్షాలు కురవడంతో మరింతగా ఒరిగిపోయింది. భవనం పిల్లర్లు బీటలు వారాయి. దీనిని గమనించిన స్థానికులు ... మిగతా 6వ పేజీలో

కేజీహెచ్‌లో సికిల్‌సెల్ పరీక్షలు

- జన్యు పరీక్ష కేంద్రం ఏర్పాటుకు రూ.4 కోట్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- ఈ సెంటర్‌తో గిరిజన ప్రాంత ప్రజలకు ఎంతో మేలు

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో మరో అత్యాధునిక పరీక్ష కేంద్రం అందుబాటులోకి రాబోతోంది. గిరిజనుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా సెంటర్ ఆఫ్ ... మిగతా 6వ పేజీలో

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఉత్సవాలు సజావుగా జరపాలని వినతి

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురంలో ఈనెల 22వ తేదీ నుంచి జరిగే భూలోకమాత అమ్మవారి ఉత్సవాలను సజావుగా నిర్వహించాలని కోరుతూ చైతన్య యువజన సేవా సంఘం అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు భీమిలి ఆర్డీఓకి వినతి పత్రం అందించారు. బుధవారం ఆయన ఆ సంఘం సభ్యులతో కలిసి ఆర్డీఓ సంగీత్ మాథూర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 22, 23, 24వ తేదీల్లో తమ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. కొంతమంది గొడవలు సృష్టించాలని ప్రయత్నిస్తున్నారని, ఉత్సవాలు సక్రమంగా జరిగేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని విన్నవించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం

తగరపువలస, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : భీమిలి కళా సాహితి నాటకోత్సవాల్లో శకుంతల నాటికను ప్రదర్శించిన చిట్టివలస సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ పాఠశాల విద్యార్థులను ఆ సంస్థ బుధవారం సత్కరించి, సర్టిఫికెట్లు ప్రదానం చేసింది. 35 మంది బాల బాలికలు నాటికలో నటించగా అందరికీ సర్టిఫికెట్లు ఇచ్చారు. పాఠశాల హెచ్‌ఎం వైఎస్‌వీ జగన్నాథస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళా సాహితి అధ్యక్షుడు పీఆర్ వర్మ, సభ్యులు పిట్ట సురేశ్, మైలపల్లి లక్ష్మణరావు, కె.సన్యాసినాయుడు, ఎల్. గణపతిరావు, నాటిక దర్శకుడు రెడ్డిపల్లి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర మాజీ మంత్రి ఆర్కే రోజా, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి బుధవారం దర్శించుకున్నారు. వారికి దేవాలయ అధికారులు మర్యాద పూర్వకంగా ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

సాగర్‌నగర్ : రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామిని రాష్ట్ర మాజీమంత్రి రోజా దంపతులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ ఎత్తైన కొండపై శ్రీవారి ఆలయం నిర్మించడం అద్భుతంగా ఉందన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

విశాలాక్షినగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : యువత సమగ్రాభివృద్ధికి క్రీడలు దోహదపడతాయని విద్యా భారతి కార్యదర్శి జిగుర ప్రతాప్ సింహ శాస్త్రి అన్నారు. స్థానిక బీవీకే కళాశాలలో విద్యా భారతి ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో విజయవాడకు చెందిన విజ్ఞాన విహార్ ఆల్ రౌండ్ ఛాంపియన్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో విద్యా భారతి ప్రతినిధులు కన్నా భాస్కర్, వీఆర్ సత్యనారాయణ, ఏవీఎస్ ఆచార్యులు, బి. నారాయణరావు, కేఆర్‌కే సత్యనారాయణ, కేఎస్ చక్రవర్తి పాల్గొన్నారు.

బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురి అరెస్టు

ఎండాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. విజయనగరం జిల్లాలోని మెంటాడ మండలానికి చెందిన బొడ్డు తిరుపతి, గొట్టాపు నాగేంద్రబాబు, రాపర్తి నాగేశ్వరరావు నుంచి మూడు స్మార్ట్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని చూడగా అందులో ఆన్‌లైన్ బెట్టింగ్‌కి సంబంధించిన అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేసి ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఇటువంటి కేసులోనే ఎనిమిది మందిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు.

ఎంఎస్‌ఎంఈ పార్కులో రైతుల వంటావార్పు



పార్కు వద్ద వంటవార్పుతో రైతుల నిరసన

పద్మనాభం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఎంఎస్‌ఎంఈ పార్కు కోసం కేటాయించిన భూముల్లో బాధిత రైతులు బుధవారం వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఎంతో కాలంగా జీడి, టేకు, నీలగిరి తోటలు పెంచుకొని జీవనం సాగిస్తున్న తమ భూములను అర్థాంతరంగా తీసుకోవడం పట్ల ఈ నిరసన వ్యక్తం చేశారు.తమకు న్యాయం చేయడంతో పాటు సాగు చేసిన తోటలకు పరిహారం, భూమికి పరిహారం చెల్లించాలని, ఏర్పాటు చేయబోయే కంపెనీల్లో యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల నిరసనకు సీఐటీయూ భీమిలి డివిజన్ నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి మద్దతుగా నిలిచారు. కాగా నిరసన కార్యక్రమాన్ని ఎస్ఐ జె. సురేశ్, ఆర్ఐ శ్యామల తదితరులు పరిశీలించారు.

వన్‌టౌన్‌లో ఒరిగిన భారీ భవనం

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదు చేయడంతో బుధవారం రాత్రి జీవీఎంసీ అధికారులు, పోలీసులు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అక్కడకు చేరుకున్నారు. పది కుటుంబాలను తక్షణమే ఖాళీ చేయాలని ఆదేశించారు. బిల్డింగ్ యజమానులకు అధికారులు నోటీసులు జారీచేశారు. పక్కనే ఉన్న భరణి ఫంక్షన్ హాల్ కూడా కొద్దిగా పక్కకు ఒరిగినట్టు అధికారులు గుర్తించారు. కశిరెడ్డి బిల్డింగ్ యజమాని జీ+2 అనుమతులు తీసుకొని జీ+5 నిర్మాణం చేపట్టారు. ధరణి ఫంక్షన్ హాల్ కూడా జీ+2 అనుమతులు తీసుకొని జీ+3 నిర్మాణం చేపట్టినట్టు అధికారులు గుర్తించారు.

సాగర్‌నగర్ బీచ్‌కు మహర్దశ

- రూ. 16 కోట్లతో సుందరీకరణ
- రూ. 3 కోట్లతో ఈట్ స్ట్రీట్
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సాగర్‌నగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ బీచ్ అభివృద్ధికి త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం ఆయన ఎంవీపీ కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో జీవీఎంసీ జోన్ 1 ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్కే బీచ్, రుషికొండ బీచ్‌కు దీటుగా సాగర్‌నగర్ బీచ్‌కు పర్యాటకులు వస్తున్న నేపథ్యంలో అందర్నీ ఆకర్షించేలా అభివృద్ధి పనులను ప్రతిపాదించాలన్నారు. రూ. 16 కోట్లతో 800 మీటర్ల పొడవున బీచ్ సుందరీకరణకు ప్రణాళిక సిద్ధం చేశామని, అందుకు సంబంధించిన ప్రెజెంటేషన్ ప్రదర్శించారు. అటవీ శాఖ భూమి కావడంతో ఆ శాఖాధికారులతో కూడా చర్చించి ముందుకు వెళ్లాలని సూచించారు. బీచ్ సుందరీకరణలో భాగంగా ఆలివ్‌రిడ్లే తాబేళ్ల జీవన చిత్రాన్ని సాక్షాత్కరించే కేంద్రాన్ని డిజైన్ చేశామని అధికారులు, ఎమ్మెల్యే గంటాకు చూపించారు. దీంతో పాటు పాత్‌వే, కాఫీ షాప్, పెవిలియన్, తాత్కాలిక నిర్మాణాలు, పార్కింగ్, వాష్ రూమ్స్ కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సముద్రంలోకి పారే వాడుక నీరు కనిపించకుండా బాక్స్ కల్వర్టు నిర్మించనున్నట్టు తెలిపారు. అలాగే సాగర్‌నగర్ బీచ్‌రోడ్ జంక్షన్‌లో రూ. 3 కోట్లతో నిర్మించనున్న ఈట్‌స్ట్రీట్‌లో 18 స్టాల్స్‌లో 220 మంది కూర్చునేలా ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. ఈట్ స్ట్రీట్ బీచ్ వైపు ఏర్పాటు చేస్తే మరింతగా అందుబాటులో ఉంటుందని ఆ దిశగా ఆలోచన చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, జోన్ వన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతి రాజు, డీఈ మణికుమార్, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎసెట్ మేనేజ్మెంట్ కన్సల్టెంట్ ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

సముద్రపు నాచుతో ఉపాధి



మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు

భీమునిపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకార మహిళలు, యువత సముద్రపు నాచు పెంపకం ద్వారా ఉపాధి పొందవచ్చునని మత్స్యశాఖ విశాఖ జేడీ పి. లక్ష్మణరావు అన్నారు. బుధవారం ఆయన చేపల తిమ్మాపురం మహిళా మత్స్యకార సంఘం కమ్యూనిటీ భవనంలో సముద్రపు నాచు పెంపకంపై మత్స్యకార మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్రం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద సముద్రపు నాచు పెంపకానికి 60 శాతం రాయితీ అందిస్తుందన్నారు. తిమ్మాపురం, మంగమారిపేట తీరం నాచు పెంపకానికి ఎంతో అనుకూలంగా ఉందని, సీఎంఎఫ్ఆర్ఐ సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ సూచనలతో మంగమారిపేట వద్ద కప్పాఫైకస్ జాతికి చెందిన నాచు రకాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ శేఖర్ మేఘరాజన్, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఫిషరీస్ టెక్నాలజీ శాస్త్రవేత్త డాక్టర్ విజ్జి, మత్స్యకార మహిళా సహకార సంఘం అధ్యక్షురాలు పార్వతమ్మ, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

సీతారాముల సన్నిధిలో హవనం





పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు (ఇన్‌సెట్లో) సీతారాములు

సింహాచలం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై గంగధార సమీపంలో ఉన్న సీతారామస్వామి దేవళంలో సంక్షిప్త రామాయణ హవనం బుధవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతి నెలలో వచ్చే శ్రీరాముడి జన్మనక్షత్రం పునర్వసు పురస్కరించుకుని లోకకల్యాణార్థం సంక్షిప్త రామాయణం, అష్టాక్షరీ మంత్ర హవనం చేయడం ఆనవాయితీ. ఈమేరకు సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు తరువాత హనుమ, లక్ష్మణ, సీతా సమేత శ్రీరాముడి ఉత్సవమూర్తిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కలశార్చన, మండపార్చన, బింబారాధన చేశారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలతో పూజలు జరిపి, ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్నిప్రతిష్ఠాపన జరిపారు. శ్రీమద్రామాయణంలోని బాల కాండను సంక్షిప్త రామాయణంగా, శ్రీరామ షడక్షరీ మంత్ర జపంతో ప్రత్యేక హవనాన్ని నిర్వహించి మహాపూర్ణాహుతి నిర్వహించారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

విశాలాక్షినగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం అని మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి. మహేశ్వరరావు అన్నారు. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న మేరా యువ భారత్ కార్యక్రమంలో భాగంగా సమ శ్రేయ ఫౌండేషన్ ఎండాడలో ఉన్న అంబేడ్కర్ కాలేజ్ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (యాక్స్) కళాశాలలో బుధవారం రాజీవ్‌గాంధీ సద్భావన దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ జర్నలిజం (ఢిల్లీ) ఛైర్మన్ ఎన్. నాగేశ్వరరావు, సమ శ్రేయ ఫౌండేషన్ అధ్యక్షుడు లీలా ప్రసాదరెడ్డి, యాక్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. పద్మారావు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం

సింహాచలం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన నరసింహ విశ్వనాథరాజు, గుణమణిదేవి దంపతులు, అలాగే నగరంలోని ఆశీలుమెట్టకు చెందిన వరద కమలాకర్, అపర్ణ దంపతులు రూ.లక్ష చొప్పున విరాళం సమర్పించారు.ఈ మొత్తాన్ని వారు నగదు రూపంలో ఈఓ వేంద్ర త్రినాథ రావుకు, దేవాలయ సహాయ కార్యనిర్వాహణాధికారి కె.తిరుమలేశ్వరరావుకు బుధవారం అందజేశారు. దాతలకు ఆలయ ఆచారం ప్రకారం అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి శేషవస్త్రాలతో సత్కరించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

నేడు షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

భీమునిపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జీవీఎంసీ నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని ఎమ్మెల్యే గంటా గురువారం ప్రారంభించనున్నారు. శిథిలావస్థకు చేరిన షాపింగ్ కాంప్లెక్స్‌ను, లాల్ బహదూర్‌శాస్త్రి కాయగూరలు,చేపల మార్కెట్ షెడ్‌లను జీవీఎంసీ అధికారులు గత ఏడాది తొలగించారు. మొత్తం 2 కోట్ల 55 లక్షల 20 వేల రూపాయలతో కొత్తగా దుకాణాలను నిర్మించారు. వాణిజ్య దుకాణాలు 11,కాయగూరలు, చేపల మార్కెట్‌లో 28 షెడ్లు నిర్మించారు. వీటిలో షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలను బహిరంగ వేలం ద్వారా, కాయగూరలు,చేపల మార్కెట్ షెడ్లను లాటరీ ద్వారా కేటాయించనున్నారు.

కేజీహెచ్‌లో సికిల్‌సెల్ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

కాంపిటెన్స్ (సీవోసీ)ను కేజీహెచ్‌లో ఏర్పాటుచేసేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ సెంటర్‌లో సికిల్‌సెల్ ఎనీమియా జబ్బు స్థాయి తెలుసుకునేందుకు అవసరమైన జన్యు పరీక్షలను నిర్వహించనున్నారు. కేంద్రం ఏర్పాటుకు అవసరమయ్యే రూ.4 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. మరో మూడు నెలల్లో ఇక్కడ జన్యు పరీక్షలను ప్రారంభించేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ నిధులతో ఈ సీవోసీ ఏర్పాటుచేయనున్నారు. ఈ సెంటర్‌లో భార్యభర్తల నుంచి రక్త నమూనాలను సేకరించి వారికి సికిల్‌సెల్ ఎనీమియా ఉందా?, ఒకవేళ ఉంటే ఏ స్థాయిలో ఉందన్నది నిర్ధారించనున్నారు. వారి నుంచి పిల్లలకు వ్యాధి సంక్రమిస్తుందా?, ...అన్నది తెలుసుకునే పరీక్షలను కూడా చేస్తారు. అలాగే, శిశువుల నుంచి సేకరించిన రక్త నమూనాలను ఇక్కడ పరీక్షిస్తారు. దీనివల్ల ముందుగానే సికిల్‌సెల్ ఎనీమియా సమస్యను గుర్తించి అవసరమైన వైద్య సేవలను అందించేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు అవసరమైన పరికరాల కొనుగోలుకు ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు ఇప్పటికే టెండర్లు పిలిచారు. జన్యుపరీక్ష కేంద్రాన్ని ఆస్పత్రిలోని ఎమర్జన్సీ వార్డు సమీపంలో ఏర్పాటు చేయనున్నారు. దేశంలో గిరిజనులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ఆరోగ్య సమస్యల్లో సికిల్‌సెల్ ఎనీమియా ఒకటిగా కేంద్రం గుర్తించింది. శరీరంలోని ఎర్ర రక్తకణాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపే జన్యుపరమైన రుగ్మతను సికిల్‌సెల్ ఎనీమియాగా పేర్కొంటారు. గత కొన్నాళ్లుగా గిరిజన ప్రాంతాల్లోని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ సమస్యను 2047 నాటికి దేశంలో పూర్తిగా నిర్మూలించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగానే దేశవ్యాప్తంగా సికిల్‌సెల్ ఎనీమియా అధికంగా ఉన్న ఏపీతో సహా 17 రాష్ట్రాల్లో జన్యు పరీక్షల కేంద్రాలను ఏర్పాటుచేస్తోంది.

టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అంకురార్పణ

... 5వ పేజీ తరువాయి

వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ యువతకు ఈ కేంద్రం బాసటగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా టై వైజాగ్, డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్, టీహేన్ ఐఐటీ హైదరాబాద్, ఆల్కోవ్ పార్టనర్స్, ఐటాప్, అట్లాస్ కాన్సిలియో, లయా గ్రీన్ వెంచర్స్, సీఐఐ యంగ్ ఇండియన్స్‌తో అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లు ప్రసంగించగా, జీఎంఆర్ ప్రతినిధి టాటా తేజ, దివీస్ ల్యాబ్స్ నుంచి డాక్టర్ సురేశ్, ఆర్సెలర్ మిట్టల్ నుంచి ఎం.రవీంద్రనాథ్, ఏయూ నుంచి రిజిస్ట్రార్ ధనుంజయరావు, గీతం నుంచి డాక్టర్ రాజా పప్పు, ఐఐపీఈ నుంచి డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

'గీతం'ను సందర్శించిన రష్యా బృందం

సాగర్‌నగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ), రష్యన్ యూనియన్ ఆఫ్ ఇండస్ట్రియల్ లిస్ట్స్ అండ్ ఎంట్రాప్రెన్యూర్స్ (ఆర్ఎస్‌పీపీ) మధ్య నైపుణ్యాభివృద్ధిలో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలో పర్యటిస్తున్న రష్యా బృందం బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఆర్ఎస్‌పీపీ డిప్యూటీ ఛైర్మన్ ఇవానోవ్ మైఖేల్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సీతాశర్మ ఆధ్వర్యంలో ఈ బృందం రాష్ట్రంలోని సాంకేతిక విద్య, బోధనా విధానాలు, మూల్యాంకనం, పారిశ్రామిక శిక్షణ, ఉపాధి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించింది. ముఖ్యంగా మెకానికల్, ఎలక్ట్రికల్, మెటలర్జి, వెల్డింగ్ టెక్నాలజీకి సంబంధించిన సిలబస్, ప్రయోగశాలలను రష్యా బృందానికి తెలియజేశారు. గీతంలోని మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన ప్రయోగశాలలను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో గీతం ప్రో వీసీ ప్రొఫెసర్ గౌతమరావు మాట్లాడుతూ నైపుణ్యం గత మానవ వనరులను అందించడానికి పరిశ్రమలతో కలిసి పని చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్, డీన్ ప్రొఫెసర్ వి. రామశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : చిప్పాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పాత మూలకుద్దు, అమనాం, జీరుపేట, అన్నవరం, పెదనాగమయ్యపాలెం,చిననాగమయ్యపాలెం, పాతపాలెం, జీరుపాలెం, ఆశిపాలెం, నమ్మివానిపాలెం, కంచేరుపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

అర్హులకు టిడ్కో ఇళ్లు ఇవ్వాలి : సీపీఐ

మల్కాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : అచ్చినాయుడు తోట, ములగాడలో నిర్మించిన టిడ్కో ఇళ్లను సీపీఐ బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయని, మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. అవి పూర్తయిన వెంటనే అర్హులకు ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వినాయక ఉత్సవాలకు పందిరి రాట

మధురవాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెంలో తారక రామనగర్ శ్రీసాయిశక్తి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలకు బుధవారం పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీసత్యనారాయణ, కార్యదర్శి ఎండీ అనీషా ఆదిల్, అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, సుజాతా రంగారావు, నరసింగ్ పట్నాయక్, చిరంజీవి వర్మ, మనోరమ తిరుపతిరావు, వంశీకృష్ణ, ఉమా రామకృష్ణ, శ్రీదివ్య సునీత, ఆడారి రమణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

మేయర్ X కమిషనర్

... 5వ పేజీ తరువాయి

సమావేశాలకు కూటమి కార్పొరేటర్లు హాజరుకావద్దని ఆదేశించారని, అందువల్లే భీమిలి జోన్‌లో జరిగిన సమావేశానికి ఎవరూ హాజరవలేదని ప్రచారం జరుగుతోంది. ఈ విషయం కమిషనర్ దృష్టికి చేరడంతో మిగిలిన జోన్‌ల సమావేశాలను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు కొందరు కార్పొరేటర్లు అభిప్రాయపడుతున్నారు. ఈక్రమంలో మేయర్‌కు, కమిషనర్‌కు మధ్య పొరపొచ్చాలు వచ్చినట్టు చెబుతున్నారు. ఇదిలావుండగా నగరంలో తీవ్రస్థాయిలో దుమారం రేపుతున్న కోడివ్యర్థాల తరలింపు వ్యవహారం ఇద్దరి మధ్య దూరాన్ని మరింత పెంచినట్టు ప్రచారం జరుగుతోంది. కాంట్రాక్టులు దక్కించుకున్నవారు కోడి వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు కాకుండా చేపల చెరువులకు తరలిస్తున్నారు. అదేవిధంగా కొంతమంది అనధికార వ్యక్తులు, రౌడీషీటర్లను పెట్టుకుని దౌర్జన్యంగా దుకాణాల నుంచి కోడి వ్యర్థాలను సేకరించి చేపల చెరువులకు విక్రయించుకుంటున్నారు. ఇందుకు కొందరు కార్పొరేటర్లు, అధికారుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో కోడి వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్న వాహనాలను పట్టుకోవాలని అధికారులను మేయర్ ఆదేశించారు. గత 20 రోజుల్లో సుమారు 30 వాహనాలను అధికారులు పట్టుకున్నారు.వాటిలో మొదట పట్టుకున్న రెండు వాహనాలపై పీఎం పాలెం స్టేషన్‌లో కేసు నమోదుకాగా మిగిలిన వాహనాలను ముడసర్లోవ డంపింగ్ యార్డు వద్ద ఉంచారు. వాటిపై కూడా కేసులు నమోదు చేయాలని అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించారు. కానీ ఇంతవరకూ ఆ వాహనాలపై కేసు నమోదు చేయకపోవడం ఆయనకు ఆగ్రహం తెప్పించింది. తన మాటను పట్టించుకోవద్దంటూ అధికారులకు కమిషనర్ ఆదేశాలు ఇచ్చారని, అందుకే కేసులు పెట్టడం లేదని మేయర్ అనుమానం వ్యక్తంచేస్తున్నారు. కమిషనర్ తీరు ఇలాగే ఉంటే కౌన్సిల్‌లో తమకు ఇబ్బంది తప్పదని ఆందోళన చెందుతున్న మేయర్‌తోపాటు కూటమి కార్పొరేటర్లు నగరంలోని ప్రజా ప్రతినిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలని యోచిస్తున్నారు.

జీవీఎంసీలో ఈట్ రైట్ క్యాంపైన్

... 5వ పేజీ తరువాయి

పరిధిలో రెండు ఎస్‌హెచ్ఈ టీమ్స్ చొప్పున మొత్తం 16 టీమ్‌లను ఈట్‌రైట్ క్యాంపైన్ కోసం ఏర్పాటు చేశామని జీవీఎంసీ కమిషనర్ వివరించారు. ఈ టీమ్‌లు హోటల్స్ రెస్టారెంట్లు, బేకరీలు, వీధి ఆహార విక్రయ కేంద్రాల్లో పదార్థాల నాణ్యత, పరిశుభ్రతను పరిశీలిస్తాయని, నిబంధనలు పాటించని, నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తున్న వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తాయన్నారు. ఇప్పటివరకూ 8 జోన్లలో 76 చోట్ల ఆహార తనిఖీలు చేపట్టాయన్నారు. 71 హోటళ్లు, రెస్టారెంట్లకు, ఆహార విక్రయ కేంద్రాలకు నోటీసులు ఇచ్చి రూ.68,600 అపరాధ రుసుము వసూలు చేశాయన్నారు. ఒకటో జోన్‌లో 8 చోట్ల తనిఖీలు చేపట్టి మూడింటి నుంచి రూ.21 వేలు, రెండో జోన్‌లో 11 చోట్ల తనిఖీలు నిర్వహించి 10 దుకాణాల నుంచి రూ.10 వేలు, మూడో జోన్‌లో పదకొండుచోట్ల తనిఖీలు చేయగా ఐదుగురి నుంచి రూ.21 వేలు, 4వ జోన్‌లో పదిచోట్ల తనిఖీలు చేపట్టి రూ.11వేలు, ఐదో జోన్‌లో పదకొండుచోట్ల తనిఖీలు చేసి ముగ్గురి నుంచి రూ.4 వేలు, 6వ జోన్‌లో ఏడుచోట్ల తనిఖీల్లో భాగంగా ఆరుగురి నుంచి రూ. 7,800, ఏడో జోన్‌లో ఆరుచోట్ల జరిగిన తనిఖీల్లో ముగ్గురి నుంచి రూ.1,300, 8వ జోన్‌లో పన్నెండుచోట్ల చేపట్టిన తనిఖీల్లో పది దుకాణాల నుంచి రూ.11 వేలు అపరాధ రుసుం కింద వసూలు చేసినట్టు చెప్పారు. ఈ టీమ్‌లు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. ప్రజల ఆహార భద్రతతో పాటు, ప్లాస్టిక్ నియంత్రణ దిశగా వ్యాపారుల్లో మార్పు తీసుకురావడమే వీటి లక్ష్యమన్నారు. తద్వారా ప్లాస్టిక్ రహిత, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ కృషి చేస్తుందని కమిషనర్ పేర్కొన్నారు. నగరంలో ఆహార విక్రయదారులు పరిశుభ్రతతో పాటు నాణ్యతపై దృష్టిసారించాలన్నారు. ఆహార ఉత్పత్తుల్లో కల్తీకి పాల్పడినా, నిషేధిత ప్లాస్టిక్ వినియోగించినా హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు ఇతర ఆహార విక్రయ కేంద్రాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కిక్కిరిస్తున్న బస్సులు

... 5వ పేజీ తరువాయి

నమోదయ్యింది. వీటిలో జీరో టికెట్లే అత్యధికంగా నమోదయ్యాయని ఆర్టీసీ అధికారులు తెలియజేశారు.

మరో 40 వేలు మహిళా ప్రయాణికులు

వివిధ కళాశాలల్లో చదివే అమ్మాయిలు ప్రస్తుతం స్టూడెంట్ పాస్‌లతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం అన్నిరకాల పాస్‌లు కలిపి 1.5 లక్షలు జారీ చేసింది. అందులో స్టూడెంట్ రాయితీ పాస్‌లు 90 వేలు ఉన్నాయి. నగరం, పరిసరాల్లో డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, ఇతర కోర్సులు చదివే విద్యార్థినుల్లో 40 వేల మంది త్రైమాసిక, అర్థ సంవత్సర, సంవత్సర కాలపరిమితితో ఆర్టీసీ రాయితీ పాస్‌లు తీసుకున్నారు. మూడు నెలలకు సంబంధించిన పాస్‌ల కాలపరిమితి ముగిసిన అమ్మాయిలు స్టూడెంట్ రాయితీ పాస్‌లు తీసుకోకుండా స్త్రీశక్తి పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఆరు నెలలు, సంవత్సర పాస్‌లు తీసుకున్న అమ్మాయిలు కూడా ఇదే పద్ధతి అనుసరిస్తారు. దీనివల్ల దశల వారీగా మరో 40 వేల మంది స్త్రీశక్తి పథకంలో చేరనున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉక్కులో ప్రైవేటు క్యాంటీన్లు మూసివేత!

... 5వ పేజీ తరువాయి

యత్నించారు.కానీ యాజమాన్యం అవకాశం ఇవ్వలేదు. మొత్తం క్యాంటీన్లన్నీ బుధవారం పూర్తిగా మూయించేసింది. వాటిలో పనిచేసే వారికి ఇచ్చే గేట్‌పాస్‌లను మంగళవారం సాయంత్రమే రద్దు చేసింది. అంటే ఆయా పనివారు ఇప్పుడు ప్లాంటులోకి వచ్చే అవకాశం లేకుండా చేసింది. పోనీ ప్రత్యామ్నాయంగా కార్మికుల కోసం ఏమైనా ఏర్పాటుచేసిందా? అంటే అదీ లేదు. అధికారిక క్యాంటీన్లు అక్కడక్కడా ఉన్నా అంత దూరం వెళ్లి రావడానికి కనీసం అరగంట సమయం పడుతుంది. ప్రస్తుతం పూర్తిస్థాయి ఉత్పత్తి పేరుతో రోజుకు 12 గంటలు పని చేయిస్తున్నారు. ఇటువంటి తరుణంలో అంతదూరం వెళ్లి టీ తాగి వస్తామంటే విభాగాధిపతులు అంగీకరించే అవకాశం లేదు. పనిచేసే స్థలంలో కార్మికులకు మౌలిక సదుపాయాలు తీసివేయడాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం సమర్థిస్తున్నదేమో మరి. యాజమాన్యం ఏమి చేసినా పైనుంచి ఎవరూ ప్రశ్నించిన దాఖలాలు కనిపించడం లేదు.

1579 మంది అనర్హులు

... 5వ పేజీ తరువాయి

మండలాల్లో 401 మంది ఉన్నట్టు గుర్తించారు. అయితే రీవెరిఫికేషన్‌లో 125 మంది 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్నట్టు నిర్ధారించారు. మరో 182 మంది 60 ఏళ్లు దాటినవారు కావడంతో వృద్ధాప్య పింఛన్లు తీసుకునేందుకు అర్హులుగా తేల్చారు. ఈ 307 మందికి త్వరలో సొమ్ము బట్వాడా చేస్తారు. కాగా దివ్యాంగ పింఛన్లు నిలిపివేతకు సంబంధించి నోటీసులు జారీచేస్తున్నారు. నోటీస్ అందుకున్న నెల రోజులలో జోనల్ కమిషనర్/ఎంపీడీవోకు అప్పీల్ చేసుకునే అవకాశం ఇచ్చారు. అయితే కొందరు పింఛన్‌దారులు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. గతంలో తమకు 40 శాతం అంగవైకల్యం ఉన్నట్టు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారని, ఇప్పుడు అవే పత్రాలు తప్పని ఎలా చెబుతారని నిలదీస్తున్నారు.

ప్లానింగ్ పట్టని నిర్మాణాలు

- పలు చోట్ల ప్లాన్ అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు
- ఇరుకు సంధుల్లో బహుళ అంతస్తుల భవనాలు
- కళ్లకు గంతలు కట్టుకున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

మద్దిలపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23వ వార్డులో ప్లాన్ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇరుకు సందుల్లో బహుళ అంతస్తులు కడుతున్నారు. అడుగు స్థలం కూడా సెట్‌బ్యాక్‌విడిచి పెట్టకుండా నిర్మాణాలు చేస్తున్నారు. గాలి, వెలుతురు మాట దేవుడెరుగు.. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే సహాయానికి నలుగురు వ్యక్తులు కూడా ఫ్రీగా వెళ్లే పరిస్థితి లేకుండా కట్టడాలు ఏర్పాటవుతున్నా... జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు పట్టించుకోకపోవడం గమనార్హం. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలిచ్చింది.

నిర్మాణాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉత్తర్వులిచ్చింది. అయితే సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు కనీసం పట్టించుకోవడం లేదనే ఆరోపనలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడికక్కడే ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతుంటే నోటీసులతో సరిపెడుతున్నారు.



మద్దిలపాలెం చేపల బజార్ వద్ద నిర్మిసున్న బహుళ అంతస్తుల భవనం



కేఆర్ఎం కాలనీ శివాలయం వీధి రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న పెంట్‌హౌస్

మద్దిలపాలెం చేపల బజార్ సందులో ఓ వ్యక్తి మూడు అంతస్తులకు అనుమతులు పొంది, అయిదు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. 6 యూనిట్లకు ప్లాన్ మంజూరు కాగా, ఏకంగా 16 యూనిట్ల నిర్మాణం చేపట్టారు. ఈ విషయం టౌన్ ప్లానింగ్ అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోలేదు. శ్లాబ్ నిర్మాణానికి ఏర్పాటు చేసిన సెంట్రింగ్ తొలగించి వెళ్లిపోయారు. కొద్ది రోజులకే సదరు బిల్డర్ ప్లానింగ్ అధికారులకు ప్రసన్నం చేసుకుని తొలగించిన నిర్మాణాలను దర్జాగా కట్టుకున్నాడు. ఈ అక్రమ నిర్మాణాల వెనుక రూ.లక్షలు చేతులు మారినట్టు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా అక్రమ అంతస్తులకు బయట వైపు సున్నాలు వేసేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులే సూచించినట్టు చెబుతున్నారు. సున్నాలు వేసేస్తే అక్రమ నిర్మాణాలు కాస్త సక్రమ నిర్మాణాలుగా మారిపోతాయని సలహా ఇచ్చారంటా? అందుకే నిర్మాణదారుడు ముందుగా బయటవైపు సున్నాలు వేసి లోపల పనులు ధీమాగా చేసుకుంటున్నాడు.

కేఆర్ఎం కాలనీలోని శివాలయం రోడ్డులో మద్దిలపాలెం గ్రేస్ చర్చ్ వెనుక సందులో ఓ నిర్మాణదారుడు నిబంధనలకు విరుద్ధంగా భారీ భవన నిర్మాణం చేపడుతున్నారు. ఇక్కడ కూడా జీ ప్లస్-2 అనుమతులు తీసుకుని జీ ప్లస్-4 నిర్మాణం జరుగుతోంది జీవీఎంసీ నిబంధనల మేరకు రోడ్డు ఫేసింగ్ వైపు ఆరున్నర అడుగులు, మిగతా మూడు వైపులా అయిదు అడుగుల స్థలం సెట్‌బ్యాక్స్ కింద విడిచి పెట్టాలి. సదరు నిర్మాణదారుడు స్థలం నాలుగు వైపులా కనీసం అడుగు స్థలం కూడా సెట్‌బ్యాక్స్‌గా విడిచిపెట్టలేదు. నిబంధనలు పట్టించుకోకుండా అడ్డగోలుగా భవనం కడుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. కేఆర్ఎం కాలనీ శివాలయం వీధి రోడ్డులో మరో నిర్మాణదారుడు జీప్లస్-2 అనుమతులు పొంది పెంట్ హౌస్ నిర్మాణం చేస్తున్నారు. ఎటువంటి సెట్‌బ్యాక్స్ విడిచిపెట్టకుండా నిర్మాణం చేస్తున్నా అధికారులు మౌనం దాల్చడం గమనార్హం. కాగా, ఈ అక్రమ భవనాల నిర్మాణాల గురించి అడగ్గా.. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మధుసూధనరావు అనుమతుల ప్రకారమే నిర్మాణాలు చేపడుతున్నారంటూ చెప్పడం గమనార్హం.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకోండి

- పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు



ప్రసంగిస్తున్న పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా పరిశ్రమలను ఏర్పాటు స్థాపించదలచిన వారికి ప్రభుత్వం అనేక ప్రోత్సహకాలను ఇస్తోందని, వాటిని వినియోగించుకోవాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు అన్నారు. ఆగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలపై అవగాహన కార్యక్రమాన్ని ఎంవీపీ కాలనీలోని భద్రం సామాజిక భవనంలో బుధవారం నిర్వహించారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్, టీమ్ ఇండస్ట్రీస్ కన్సల్టెన్సీ, సర్వీసెస్, ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీమ్ ఇండస్ట్రీస్ కన్సల్టెన్సీ సర్వీసెస్ మేనేజింగ్ డైరక్టర్ డి.మధుసూదనరావు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్‌పర్సన్ గీతా శ్రీకాంత్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డెప్యూటీ జనరల్ మేనేజర్ ఏవీ రమణమూర్తి తదితరులు మాట్లాడుతూ.. కొత్తగా వ్యాపారాలు ప్రారంభించదలచినవారు, ఇప్పటికే పరిశ్రమలు నెలకొల్పిన వారికి మార్గదర్శనం కల్పించడంతో పాటు, ప్రభుత్వ ఎంఎస్ఎంఇ పథకాలు, రుణాలు, రాయితీలపై అవగాహన కల్పించారు.

శివాజీపాలెంలో అన్న సంతర్పణ



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వెలగపూడి ప్రతాప్

మద్దిలపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డు శివాజీపాలెంలోని శ్రీకృష్ణుడి ఆలయం వద్ద శ్రీకృష్ణ సేవాసంఘం ఆధ్వర్యంలో బుధవారం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్ పాల్గొని భక్తులకు ప్రసాదం వడ్డించారు. ముందుగా ఆయన రాధాకృష్ణులకు దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి పూజలు జరిపి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఒమ్మి అప్పారావు, దువ్వి స్వామి తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి శాప్ జోనల్ క్రీడా పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ నేతృత్వంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఈ నెల 22, 23 తేదీల్లో అమరావతి చాంపియన్‌షిప్ పేరుతో జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనుందని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అండర్-22 విభాగంలో ఆర్చరీ, అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్ పోటీలు, అండర్-19 విభాగంలో బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో విశాఖ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల జట్ల నుంచి పురుషులు, మహిళల విభాగాలకు సుమారు 1800 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. రైల్వే స్పోర్ట్సు ఎరీనాలో బాక్సింగ్, చంద్రంపాలెం స్కూల్‌లో బాస్కెట్‌బాల్ పోటీలు జరుగుతాయని, మిగిలిన క్రీడాంశాల పోటీలు కొమ్మాదిలోని ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు కాంప్లెక్సులో జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడాప్రాంగణాలలో తాగునీరు, పారిశుధ్యం, సంచార మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని మధురవాడ జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. వైద్య సదుపాయం నిమిత్తం అంబులెన్స్, మందులు, వైద్యులను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. జోనల్ స్థాయిలో గెలుపొందినవారు ఈ నెల 24 నుంచి 26 వరకు తిరుపతిలో జరగనున్న తుది పోటీల్లో పాల్గొంటారని, వారికి బస్సు రవాణా సదుపాయం కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, జోనల్ కమిషనర్ కనకదుర్గ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెస్ టోర్నీలో నిధి కేశవరావుకు పసిడి పతకాలు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల చదరంగం సంఘం నిర్వహించిన ప్రపంచ ఐపీసీఏ వ్యక్తిగత చెస్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన బి.నిధి కేశవరావు పతకాల పంట పండించింది. గోవాలో జరిగిన ఈ టోర్నీలో దేశానికి మూడు స్వర్ణ పతకాలు అందించింది. 20 దేశాల నుంచి సుమారు వంద మంది ప్రాతినిధ్యం వహించిన ఈ టోర్నీలో అండర్-15 జూనియర్ బాలికల విభాగంలో నిధికేశవరావు ఎత్తుకు పైఎత్తులతో ప్రతిభను ప్రదర్శించింది. స్టాండర్డ్ చెస్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన నిధి...ర్యాపిడ్, బ్లిట్జ్ ఈవెంట్ లోనూ పసిడి పతకాలు కైవసం చేసుకుంది. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ నుంచి పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకుంది. కోచ్‌లు జేఎస్.రాజు, సీహెచ్.నారాయణరావు, అప్పారావుల వద్ద శిక్షణ పొందుతున్న నిధికేశవరావు దేశానికి పతకాలు అందించడం గర్వకారణమని పలువురు అభినందించారు. ఈత క్రీడాకారిణిగానూ జాతీయ పారా స్విమ్మింగ్ టోర్నీలలో నిధి పతకాలు సాధించింది.



స్వర్ణ పతకాలతో నిధి కేశవరావు

ఛాయాచిత్రాలు చరిత్రకు ఆనవాళ్లు

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న పల్లా శ్రీనివాసరావు తదితరులు

బీచ్‌రోడ్డు, ఆగస్టు 20, (ఆంధ్రజ్యోతి) : ఛాయాచిత్రాలు చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచిపోతాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బీచ్ రోడ్డు వద్ద ఉన్న విశాఖ మ్యూజియంలో వైజాగ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను బుధవారం ఆయన తిలకించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ అపురూప దృశ్యాలను కళ్లకు కట్టినట్టుగా చూపించిరంటూ ఫొటోగ్రాఫర్లను అభినందించారు. అద్భుత దృశ్యాలు, అపురూప సంఘటలను శాశ్వతంగా నిలిచేలా శక్తి ఫొటోగ్రాఫర్లకు మాత్రమే సొంతమని పేర్కొన్నారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాల వల్ల వృత్తిపరమైన పోటీతో పాటు సామాజిక చైతన్యం పెంపొందించే అవకాశం ఉంటుందన్నారు.



ఫొటోలను తిలకిస్తున్న నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ఛాయాచిత్రాలు చూస్తుంటే ఆయా సంఘటన జరిగినప్పుడు ఫొటోగ్రాఫర్ల సమయస్ఫూర్తి, వారిలోని ప్రతిభాపాటవాలు గుర్తించవచ్చన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల అభిరుచి, సామాజిక స్పృహ, ప్రతిభ స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఇక్కడ ఫొటో ఎగ్జిబిషన్ చూడడం ద్వారా విశాఖ అందాలు, ప్రకృతి జీవన స్థితిగతులు చూసే అవకాశం లభించిందని పేర్కొన్నారు. అలాగే మాజీ మంత్రి, సినీ నటి ఆర్కే రోజా ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ ప్రదర్శన చూస్తుంటే ఫొటోగ్రాఫర్ల ప్రతిభ, ఫొటోగ్రఫీ ప్రాధాన్యం స్పష్టమవుతోందన్నారు. కార్యక్రమంలో వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అధ్యక్షుడు వై.రామకృష్ణ, కార్యదర్శి ఎండీ నవాజ్, కోశాధికారి ఎ.శరత్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో డయాగ్నస్టిక్ ల్యాబ్ ప్రారంభం

- ఐవోసీఎల్ సీఎస్ఆర్ నిధులు రూ.8.93 కోట్లతో ఏర్పాటు



డయాగ్నస్టిక్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఐవోసీఎల్ డైరెక్టర్ రష్మి గోవిల్

అగనంపూడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో కీలకమైన డయాగ్నస్టిక్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం ఈ ల్యాబ్‌ను ఐవోసీఎల్ హెచ్‌ఆర్ విభాగం డైరెక్టర్ రష్మి గోవిల్, ఆస్పత్రి డైరెక్టర్ ఉమేశ్ మహంతిశెట్టి కలిసి ప్రారంభించారు. అనంతరం రష్మి గోవిల్ మాట్లాడుతూ హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ఇక్కడ తమ సంస్థ రూ.8.93 కోటుఌ వెచ్చించి డయాగ్నస్టిక్ పరికరాలను సమకూర్చి ల్యాబ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దేశంలో క్యాన్సర్ రోగులు విపరీతంగా పెరుగుతున్నారని, అందువల్ల అందరూ ముందస్తు జాగ్రత్రలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐవోసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బిబూతి రంజన్ ప్రదాన, డైరెక్టర్ అండ్ స్టేట్ హెడ్ పియూష్ మిట్టల్, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారుడు అంబిరెడ్డి మృతి



జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అంబిరెడ్డి

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మరడపాలెం గ్రామానికి చెందిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడు చిల్ల అంబిరెడ్డి (56) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. చిల్లపేట ఫుట్‌బాల్ జట్టులో ప్రధాన ఆటగాడిగా అనేక ప్రాంతాల్లో పోటీల్లో పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో అనేక సార్లు బహుమతులు పొందారు. తరువాత కొంతకాలం ఆర్మీలో పనిచేశారు. విధి నిర్వహణలో శరీరంలో కింది భాగం పనిచేయకపోవడంతో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఆ సమయంలో దివ్యాంగుల త్రోబాల్ పోటీలో పాల్గొని జాతీయ స్థాయిలో బహుమతి పొందారు. నాటి ప్రధాని వాజ్‌పేయి పురస్కారం కూడా అందించారు. కొంతకాలంగా అనారోగ్యం వల్ల మంచానికే పరిమితమయ్యారు. ఆయన మృతి పట్ల కార్మిక నాయకులు అప్పలరెడ్డి,ఆదినారాయణ, త్రినాథరెడ్డి, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వినాయక చవితి ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాటలో పాల్గొన్న మహిళలు, అసోసియేషన్ ప్రతినిధులు

ఆరిలోవ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలి యంగ్ బాయ్స్ యూత అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాల కోసం పందిరి రాటను బుధవారం వేశారు. ఈ ఏడాది భారీ ఎత్తున చవితి వేడుకలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దువ్వి సంతోష్, పాత్రేరు గిరి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం).
● **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
● **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
● **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గాజువాక, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్టీల్ సిటీ ఐటీఐలో మిగులు సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు 27వ తేదీన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు, 29న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు ఐటీఐను సంప్రందించాలని కోరారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 47, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 26, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 22, బీరకాయలు 38, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 42, దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 58, బద్దచిక్కుడు 50, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75,కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 72, కీరదోస 34, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	103
లైవ్ ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

చెత్త తొలగించె.. అందమైన రంగవల్లులు వేయించె

- 16వ వార్డు శానిటరీ సిబ్బంది చర్యలపై స్థానికుల హర్షం



చెత్తను తొలగించిన రంగుల రంగవల్లికలు తీర్చిదిద్దిన కేఆర్ఎం కాలనీ పార్కు ప్రాంతం

వెంకోజీపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పది మంది తిరిగే చోటును అందంగా ఉంచుకుందాం... నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుదామనే సంకల్పాన్ని 16వ వార్డు శానిటరీ సిబ్బంది పూనుకున్నారు.

క్రమంలో వార్డులోని కేఆర్ఎం కాలనీ పార్కు వద్ద ప్రతిరోజు పేరుకుపోతున్న చెత్తను తొలగించి, ఆ ప్రాంతంలో రంగు రంగుల హరివిల్లులను రూపుదిద్దారు. పది మంది నడియాడి.. అలసత్వం, ఆయాసం పోగొట్టుకుని ఆరోగ్యాన్ని పొందేందుకు వచ్చే ప్రాంతంలో ప్రతిరోజూ చెత్త దర్శనమిచ్చేది. దీని నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించి, సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు వార్డు శానిటరీ సిబ్బంది నడుం బిగించారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు నేతృత్వంలో శుభ్రం మేస్త్రిలు జి.బాబు, నమ్మిచిన్నరాజు పారిశుధ్య సిబ్బందితో పార్కు వద్ద పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించి, ఆ ప్రాంతంలో ముగ్గులను వేయించారు. ఇక్కడ చెత్తను వేసేవారు కనీసం ఈ ముగ్గులను చూసైనా చెత్తను వేయకుండా ఉంటారనే ఆలోచనతో ఈ చర్యలు చేపట్టినట్టు పారిశుధ్య విభాగం అధికారులు తెలిపారు. ఇలా వార్డులోని మరిన్ని ప్రాంతాలను చెత్త రహిత ప్రాంతాలుగా, సర్వాంగ సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని వారు పేర్కొన్నారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చెత్త తొలగించక ముందు పరిస్థితి (ఫైల్)

గవర్నర్‌ను కలిసిన ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య జీపీ రాజశేఖర్ బుధవారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అభివృద్ధి, శతాబ్ది ఉత్సవాల నిర్వహణ తదితర అంశాలపై గవర్నర్‌కు వీసీ వివరించారు. 91, 92వ స్నాతకోత్సవ నిర్వహణ అంశాలను వివరించారు.



గవర్నర్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

భవిష్యత్తులో రోలర్ స్కేటింగ్‌కు చిరునామాగా విశాఖ

- రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు



పతకాలు సాధించిన స్కేటర్లతో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

మద్దిలపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్‌లో రోలర్ స్కేటింగ్‌కు విశాఖ చిరునామాగా మారుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో బుధవారం ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పతకాలు సాధించిన స్కేటర్లు, వారి కోచ్‌లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులకు మరింత ప్రోత్సహించేందుకు అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించేలా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు సంబంధించి కొత్త విధానాన్ని తీసుకువచ్చి క్రీడాకారులకు మరింత ప్రోత్సహిస్తోందన్నారు. అలాగే పతకాలు సాధించిన స్కేటర్లకు అభినందనలు తెలియజేశారు.

వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి చంద్రనాయుడు కృషి చేస్తున్నారన్నారు. విశాఖ స్కేటర్లు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి నగరానికి మరింత పేరుప్రఖ్యాతలు తీసుకువచ్చారన్నారు. విశాఖ స్కేటింగ్ అభివృద్ధికి వీఎంఆర్డీఏ తరపున ఎలాంటి సహాయం కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వీఎంఆర్డీఏ పార్కులో స్కేటింగ్ అభివృద్ధి కోసం రూ.3.50 కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో స్కేటింగ్ బోర్డు నిర్మిస్తున్నామన్నారు.

అనంతరం ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్, విశాఖ జిల్లా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ ఆధ్వర్యంలో పతకాలు సాధించిన స్కేటర్లు, వారి కోచ్‌లకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాధన్, అసోసియేషన్ ప్రతినిధులు భగీరథకుమార్, జె.సుధాకరరెడ్డి, థామస్, శీలం లక్ష్మణ్, వై.రమేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా పార్కింగ్ స్థలాల ఆక్రమణ

» చోద్యం చూస్తున్న యంత్రాంగం



ఓ వాణిజ్య దుకాణం ముందు అడ్డంగా పెట్టిన బారికేడ్లు



రోడ్డుపై నిలిపిన కార్లు

మహారాణిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వాహనాలు పార్కింగ్ చేసుకొనే స్థలాలను షాపింగ్ యాజమాన్యాలు కబ్జా చేయడంతో వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలపాల్సి వస్తోంది. ట్రాఫిక్ పోలీసులు ఇలాంటి వాహనాల ఫొటోలు తీసి జరిమానా చెల్లించాలంటూ నోటీసులు పంపుతుండడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కలెక్టరేట్ నుంచి కేజీహెచ్ మీదుగా లేపాక్షి జంక్షన్ వైపు వచ్చే రహదారిపై ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. కేజీహెచ్ నుంచి ఈ మార్గం నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. కేజీహెచ్ ఓపీ గేట్ నుంచి లేపాక్షి జంక్షన్ వరకు వాహనదారులతో రద్దీగా ఉంటూ అనేకసార్లు ట్రాఫిక్ నిలిచిపోతుంది. అత్యంత రద్దీగా కనిపించే ఈ ప్రాంతంలో రహదారి చిన్నది కావటంతో వన్ వే అమలు చేశారు. మరోవైపు వాహనదారులు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తుండటం ట్రాఫిక్ రద్దీకి కారణమవుతోంది. కొంతమంది యజమానులు తమ షాపు ముందర పార్కింగ్ స్థలాలు ఆక్రమించి వాహనాలు పార్కింగ్ చేయకుండా సెక్యూరిటీ గార్డులను వినియోగిస్తున్నారు. వారి వాహనాలతోపాటు షాపులకు వచ్చే వారి వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. వారితో వివాదం ఇష్టంలేక వాహనదారులు రోడ్డు మీద పార్కింగ్ చేస్తున్నారు. కానీ అక్కడ 'నో పార్కింగ్ జోన్' అంటూ ట్రాఫిక్ పోలీసులు బోర్డు పెడుతున్నారు. వాహనాల ఫొటోలు తీసి చలానాలు పంపుతున్నారని వాహనదారులు వాపోతున్నారు. కొంతమంది పబ్లిక్ స్థలం కబ్జా చేయడమే కాకుండా ఏకంగా తాడు కట్టి మరీ ఎవరూ పార్కింగ్ చేయకుండా అడ్డుకుంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు చోద్యం చూస్తున్నారు తప్ప కబ్జాదారుల నుంచి పార్కింగ్ స్థలాలను స్వాధీనం చేసుకోవడం లేదు. ట్రాఫిక్ పోలీసు అధికారులు ఆక్రమిత పార్కింగ్ స్థలాలను స్వాధీనం చేసుకుని వాహనాల పార్కింగ్‌కు వీలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఉద్యోగాల క్రమబద్ధీకరణకు వినతి



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి వినతిపత్రం ఇస్తున్న నర్సింగ్ పోరాట కమిటీ ప్రతినిధులు

మహారాణిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సేవలను క్రమబద్ధీకరించి, ఇతర భత్యాలు, వంద శాతం స్థూల వేతనం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. కేజీహెచ్‌లో పోరాట కమిటీ ప్రతినిధులు బుధవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పదేళ్లుగా రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో విధులు నిర్వహిస్తూ, వృత్తిపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో వైద్య సేవలు అందిస్తూ అనేకమంది సహచర సిబ్బంది మృతిచెందారని గుర్తుచేశారు. తక్కువ జీతం పొందినప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటూనే యోధులుగా పనిచేశామని పేర్కొన్నారు. హెల్త్ కార్డు, కరవు భత్యం, ఇంటి అద్దె, మెడికల్ లీవ్‌లు, నైట్ డ్యూటీ అలవెన్స్ ఇవ్వాలని అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. పరస్పర అంగీకార బదిలీలను అనుమతించాలని కోరారు. సంఘం నాయకులు సత్యనారాయణ, పద్మాక్షి, శోభ, శ్రీమణి తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో సికిల్‌సెల్ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

కాంపెటెన్స్ (సీవోసీ)ను కేజీహెచ్‌లో ఏర్పాటుచేసేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ సెంటర్‌లో సికిల్‌సెల్ ఎనీమియా జబ్బు స్థాయి తెలుసుకునేందుకు అవసరమైన జన్యు పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుకు అవసరమయ్యే రూ.4 కోట్లను కేంద్రం మంజూరుచేసింది. మరో మూడు నెలల్లో ఇక్కడ జన్యు పరీక్షలను ప్రారంభించేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ నిధులతో ఈ సీవోసీ ఏర్పాటుచేయనున్నారు. ఈ సెంటర్‌లో భార్యభర్తల నుంచి రక్త నమూనాలను సేకరించి వారికి సికిల్‌సెల్ ఎనీమియా ఉందా?, ఒకవేళ ఉంటే ఏ స్థాయిలో ఉందన్నది నిర్ధారించనున్నారు. వారి నుంచి పిల్లలకు వ్యాధి సంక్రమిస్తుందా?, ...అన్నది తెలుసుకునే పరీక్షలను కూడా చేస్తారు. అలాగే, శిశువుల నుంచి సేకరించిన రక్త నమూనాలను ఇక్కడ పరీక్షిస్తారు. దీనివల్ల ముందుగానే సికిల్‌సెల్ ఎనీమియా సమస్యను గుర్తించి అవసరమైన వైద్య సేవలను అందించేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు అవసరమైన పరికరాల కొనుగోలుకు ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు ఇప్పటికే టెండర్లు పిలిచారు. జన్యుపరీక్ష కేంద్రాన్ని ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డు సమీపంలో ఏర్పాటు చేయనున్నారు. దేశంలో గిరిజనులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ఆరోగ్య సమస్యల్లో సికిల్‌సెల్ ఎనీమియా ఒకటిగా కేంద్రం గుర్తించింది. శరీరంలోని ఎర్ర రక్తకణాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపే జన్యుపరమైన రుగ్మతను సికిల్‌సెల్ ఎనీమియాగా పేర్కొంటారు. గత కొన్నాళ్లుగా గిరిజన ప్రాంతాల్లోని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ సమస్యను 2047 నాటికి దేశంలో పూర్తిగా నిర్మూలించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగానే దేశవ్యాప్తంగా సికిల్‌సెల్ ఎనీమియా అధికంగా ఉన్న ఏపీ సహా 17 రాష్ట్రాల్లో జన్యుపరీక్షల కేంద్రాలను ఏర్పాటుచేస్తోంది.

నేడు, రేపు సహకార సంఘ సభ్యుల వివరాల సేకరణ

అక్కయ్యపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): డైమండ్ పార్కు సమీపంలోని 'ది స్నేహ పరస్పర సహాయక సహకార సంఘం'లో జరిగిన అవకతవకలపై గురువారం విచారణ జరుపుతామని అధికారి టి.నందన ఒక ప్రకటనలో తెలిపారు. విచారణలో భాగంగా సంఘంలో మదుపరుల వివరాలు, ఏడాదిలో వారు ఎంత మొత్తం మదుపు చేశారు? వారికి రావాల్సిన మొత్తం సొమ్ము వివరాలు తెలుసుకుంటామన్నారు. సంఘంలో పొదుపు చేసినవారు గురు, శుక్రవారాల్లో డైమండ్ పార్కు వద్ద ఉన్న డివిజనల్ సహకార అధికారి కార్యాలయంలో ఉదయం 10-30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య బాండు వివరాలు తెలియజేయాలని సూచించారు.

దాతలు దయతలిస్తే సైకిల్ చాంపియన్‌షిప్‌కు పోటీపడతా

» జాతీయ పోటీలకు టైమ్ ట్రయల్ బైక్ కొనే శక్తిలేక రవికిరణ్ నిరీక్షణ



సైకిల్ బైక్‌తో రవికిరణ్

మహారాణిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు సైకిలింగ్‌లో అనేకసార్లు రాష్ట్ర స్థాయిలో చాంపియన్‌గా నిలిచిన కె.వంశీకిరణ్ (22) జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేందుకు సిద్ధంగా ఉన్నాడు. నగరంలో దక్షిణ నియోజకవర్గానికి చెందిన ఈ యువ సైకిలిస్టుకు ఖరీదైన సైకిల్ కొనుగోలు చేసేందుకు ఆర్థిక సమస్య అడ్డంకిగా మారింది. బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం సమీపంలో మట్టా వెంకటప్పయ్య వీధిలో నివాసం ఉంటున్న వంశీకిరణ్ డిగ్రీ చదివాడు. రోడ్డు సైకిలింగ్‌లో ఇప్పటికే రాష్ట్ర చాంపియన్‌గా నిలిచాడు. రాష్ట్రం తరఫున మూడు చాంపియన్‌షిప్‌లకు ప్రాతినిధ్యం వహించాడు, ఓసారి జాతీయ స్థాయిలో పోటీపడ్డాడు. త్వరలో జరగనున్న నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాలని అభిలషిస్తున్నాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను మెరుగు పరుచుకోవటానికి సుమారు రూ.8.25 లక్షల విలువైన టైమ్ ట్రయల్ (టీటీ) బైక్ (సైకిల్) అవసరం. ఈ సైకిల్ కొనుగోలు చేయటానికి అతడి వద్ద ధనం లేదు. కలెక్టర్, పోలీసు కమిషనర్‌లకు విజ్ఞప్తి చేయడంతో ప్రభుత్వం నుంచి కొంత ఆర్థిక సహాయం అందింది. సుమారు రూ.6.5 లక్షల వ్యక్తిగత రుణం పొందాడు. ఇంకా సుమారు రూ.1.75 లక్షలు అవసరం. ఎవరైనా ప్రోత్సాహం అందించాలని వంశీకిరణ్ ఆశగా ఎదురు చూస్తున్నాడు. రాష్ట్రానికి, దేశానికి కీర్తి సంపాదించాలని కోరుకుంటున్న ఈ యువ సైకిలిస్టు తన స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు క్రీడాభిమానులు, దాతలు, శ్రేయోభిలాషుల సహకారం కోసం ఎదురుచూస్తున్నాడు.

చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు



మాత్రలు వేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు

సీతమ్మధార, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భానోజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో గల బర్మాక్యాంపు, జైభారత్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. జిల్లాలో ఏడాది వయసు నుంచి పదేళ్లలోపు బాలబాలికలు 5,15,264 మంది ఉన్నారని, వీరిలో ఇప్పటి వరకు 5,14,544 మందికి అల్బెండజోల్ మాత్రలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఉమాపతి, డీపీఎంఒ, ఎన్‌హెచ్‌ఎం బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేయర్ X కమిషనర్

... 5వ పేజీ తరువాయి

సమావేశాలకు కూటమి కార్పొరేటర్లు హాజరుకావద్దని ఆదేశించారని, అందువల్లే భీమిలి జోన్‌లో జరిగిన సమావేశానికి ఎవరూ హాజరవలేదని ప్రచారం జరుగుతోంది. ఈ విషయం కమిషనర్ దృష్టికి చేరడంతో మిగిలిన జోన్‌ల సమావేశాలను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు కొందరు కార్పొరేటర్లు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో మేయర్‌కు, కమిషనర్‌కు మధ్య పొరపొచ్చాలు వచ్చినట్టు చెబుతున్నారు. ఇదిలావుండగా నగరంలో తీవ్రస్థాయిలో దుమారం రేపుతున్న కోడివ్యర్థాల తరలింపు వ్యవహారం ఇద్దరి మధ్య దూరాన్ని మరింత పెంచినట్టు ప్రచారం జరుగుతోంది. కాంట్రాక్టులు దక్కించుకున్నవారు కోడి వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు కాకుండా చేపల చెరువులకు తరలిస్తున్నారు. అదేవిధంగా కొంతమంది అనధికార వ్యక్తులు, రౌడీషీటర్లను పెట్టుకుని దౌర్జన్యంగా దుకాణాల నుంచి కోడి వ్యర్థాలను సేకరించి చేపల చెరువులకు విక్రయించుకుంటున్నారు. ఇందుకు కొందరు కార్పొరేటర్లు, అధికారుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో కోడి వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్న వాహనాలను పట్టుకోవాలని అధికారులను మేయర్ ఆదేశించారు. గత 20 రోజుల్లో సుమారు 30 వాహనాలను అధికారులు పట్టుకున్నారు. వాటిలో మొదట పట్టుకున్న రెండు వాహనాలపై పీఎం పాలెం స్టేషన్‌లో కేసు నమోదు కాగా మిగిలిన వాహనాలను ముడసర్లోవ డంపింగ్ యార్డు వద్ద ఉంచారు. వాటిపై కూడా కేసులు నమోదు చేయాలని అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించారు. కానీ ఇంతవరకూ ఆ వాహనాలపై కేసు నమోదు చేయకపోవడం ఆయనకు ఆగ్రహం తెప్పించింది. తన మాటను పట్టించుకోవద్దంటూ అధికారులకు కమిషనర్ ఆదేశాలు ఇచ్చారని, అందుకే కేసులు పెట్టడం లేదని మేయర్ అనుమానం వ్యక్తంచేస్తున్నారు. కమిషనర్ తీరు ఇలాగే ఉంటే కౌన్సిల్‌లో తమకు ఇబ్బంది తప్పదని ఆందోళన చెందుతున్న మేయర్‌తోపాటు కూటమి కార్పొరేటర్లు నగరంలోని ప్రజా ప్రతినిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలని యోచిస్తున్నారు.

వినాయక మండపాలకు ఒకేచోట అనుమతులు

జ్ఞానాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-5 పరిధిలోని 41 నుంచి 63 వార్డుల్లో ఏర్పాటు చేసే వినాయక చవితి మండపాలకు ఒకేచోట (సింగిల్ విండో) అనుమతులు ఇస్తామని జోనల్ కమిషనర్ బి.రాము తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా దరఖాస్తు తీసుకుని వివరాలు నమోదు చేసి జోనల్ కార్యాలయంలో అందజేస్తే పరిశీలించి అనుమతి మంజూరు చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 97050 86888, 99121 99283 నంబర్లలో సంప్రదించాలని లేదా నేరుగా జ్ఞానాపురంలోని జోనల్ కారాలయంలో సూపరింటెండెంట్‌ను కలవాలని సూచించారు.

పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టండి

జ్ఞానాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలోని వృక్షశాస్త్ర విభాగం గ్రీన్ గ్లోబ్ నేచర్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బ్యాడ్జింగ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ కన్వీనర్ డాక్టర్ కె.మాణిక్యకుమారి మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటడం, నీటి సంరక్షణ, ప్లాస్టిక్ వ్యతిరేక ప్రచారాలు వంటి పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టాలని ఆమె ప్రోత్సహించారు. అనంతరం విద్యార్థినులకు బ్యాడ్జీలు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఎ.సంజన, వి.డింపుల్, ఆర్.రేణుక, ఎ.మేఘన పాల్గొన్నారు.

ప్రైవేటు కోసమే స్టీల్‌ప్లాంట్ ముస్తాబు

» కేంద్రం వైఖరికి వంతపాడుతున్న కూటమి ప్రభుత్వం

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు ఆరోపణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

మహారాణిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కానివ్వబోమని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నాయకులు నేడు కేంద్రం నిర్ణయాలను సమర్థిస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు ఆరోపించారు. విశాఖ స్టీల్‌ను ముస్తాబు చేసి ప్రైవేటుకు అప్పగించేందుకు కేంద్రం ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటే, రాష్ట్రం వంతపాడుతోందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చవకబారు వాదనలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. జగదాంబ జంక్షన్‌లోని సిటు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విషయంలో గత వైసీపీ ప్రభుత్వ తీరు నచ్చక ప్రజలు ఘోరంగా ఓడించారన్న విషయం కూటమి నాయకులు గుర్తుంచుకోవాలని సూచించారు. 34 విభాగాలను ప్రైవేటీకరించడం ద్వారా కొత్త కాంట్రాక్టర్లకు బాధ్యతలు అప్పగిస్తారని, దీనితో స్థానికులు ఉద్యోగాలు కోల్పోతారని అన్నారు. గాజువాక ప్రాంతం ఎడారిగా మారిపోతుందని పేర్కొన్నారు. ఎమర్జన్సీని తలపించేలా దీక్షా శిబిరాలకు సైతం అనుమతులు ఇవ్వటం లేదని నర్సింగరావు ఆక్షేపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి అనేక రకాలుగా ప్రయత్నిస్తోందని, నిర్వాసితుల మధ్య అనైక్యత సృష్టిస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో ఆర్‌కేఎస్వీ కుమార్, యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిస్తున్న బస్సులు

... 5వ పేజీ తరువాయి

నమోదయ్యింది. వీటిలో జీరో టికెట్లే అత్యధికంగా నమోదయ్యాయని ఆర్టీసీ అధికారులు తెలియజేశారు.

మరో 40 వేలు మహిళా ప్రయాణికులు

వివిధ కళాశాలల్లో చదివే అమ్మాయిలు ప్రస్తుతం స్టూడెంట్ పాస్‌లతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం అన్నిరకాల పాస్‌లు కలిపి 1.5 లక్షలు జారీ చేసింది. అందులో స్టూడెంట్ రాయితీ పాస్‌లు 90 వేలు ఉన్నాయి. నగరం, పరిసరాల్లో డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, ఇతర కోర్సులు చదివే విద్యార్థినుల్లో 40 వేల మంది త్రైమాసిక, అర్ధ సంవత్సర, సంవత్సర కాలపరిమితితో ఆర్టీసీ రాయితీ పాస్‌లు తీసుకున్నారు. మూడు నెలలకు సంబంధించిన పాస్‌ల కాలపరిమితి ముగిసిన అమ్మాయిలు స్టూడెంట్ రాయితీ పాస్‌లు తీసుకోకుండా స్త్రీశక్తి పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఆరు నెలలు, సంవత్సర పాస్‌లు తీసుకున్న అమ్మాయిలు కూడా ఇదే పద్ధతి అనుసరిస్తారు. దీనివల్ల దశల వారీగా మరో 40 వేల మంది స్త్రీశక్తి పథకంలో చేరనున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

పారా వాలీబాల్ వరల్డ్ కప్ పోటీలకు గణేష్, విజయ్‌కుమార్ ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న బోడపాటి శివదత్

సీతంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 12 నుంచి 18 వరకు అమెరికాలో జరిగే పారా వాలీబాల్ వరల్డ్ కప్ పోటీలకు రాష్ట్రానికి చెందిన దివ్యాంగులు అన్న గణేష్, వేల్పుల విజయ్‌కుమార్‌లు ఎంపికైనట్టు పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (పీవీఏపీ) అధ్యక్షుడు బోడపాటి శివదత్ తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగ వైకల్యం శరీరానికే కాని, మనసుకు కాదని నిరూపిస్తూ సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో రాష్ట్రం తరఫున అద్భుతమైన ఆటతీరును అన్నం గణేష్, వేల్పుల విజయ్‌కుమార్‌లు ప్రదర్శించి ప్రపంచ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. గతంలో జరిగిన పారా వాలీబాల్ పోటీల్లో విజయనగరానికి చెందిన దివ్యాంగురాలు బి.వరలక్ష్మి గెలుపొందారని తెలిపారు. సమావేశంలో పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు జంపా నాగసంతోషరావు, దుండగి స్వరూప్, ముక్కా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు



ఆలయంలో కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

మహారాణిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో బుధవారం హుండీ కానుకలు లెక్కించారు. ఈ ఏడాది జూన్ 11 నుంచి బుధవారం వరకు హుండీలలో భక్తులు వేసిన నగదు, బంగారం, వెండి తదితర కానుకలు లెక్కించారు. మొత్తం రూ.46,53,301 నగదు, 84.900 గ్రాముల బంగారం, 795 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఈవో కె.శోభారాణి, జిల్లా దేవదాయశాఖ అధికారిణి అన్నపూర్ణ, ఎం.శ్రీధర్ పాల్గొన్నారు.

జీవీఎంసీలో ఈట్ రైట్ క్యాంపైన్

... 5వ పేజీ తరువాయి

పరిధిలో రెండు ఎస్‌హెచ్‌ఈ టీమ్స్ చొప్పున మొత్తం 16 టీమ్‌లను ఈట్‌రైట్ క్యాంపైన్ కోసం ఏర్పాటు చేశామని జీవీఎంసీ కమిషనర్ వివరించారు. ఈ టీమ్‌లు హోటల్స్, రెస్టారెంట్లు, బేకరీలు, వీధి ఆహార విక్రయ కేంద్రాల్లో పదార్థాల నాణ్యత, పరిశుభ్రతను పరిశీలిస్తాయని, నిబంధనలు పాటించని, నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తున్న వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తాయన్నారు. ఇప్పటివరకూ 8 జోన్లలో 76 చోట్ల ఆహార తనిఖీలు చేపట్టాయన్నారు. 71 హోటళ్లు, రెస్టారెంట్లకు, ఆహార విక్రయ కేంద్రాలకు నోటీసులు ఇచ్చి రూ.68,600 అపరాధ రుసుము వసూలు చేశాయన్నారు. ఒకటో జోన్‌లో 8 చోట్ల తనిఖీలు చేపట్టి మూడింటి నుంచి రూ.21 వేలు, రెండో జోన్‌లో 11 చోట్ల తనిఖీలు నిర్వహించి 10 దుకాణాల నుంచి రూ.10 వేలు, మూడో జోన్‌లో పదకొండుచోట్ల తనిఖీలు చేయగా ఐదుగురి నుంచి రూ.21 వేలు, 4వ జోన్‌లో పదిచోట్ల తనిఖీలు చేపట్టి రూ.11 వేలు, ఐదో జోన్‌లో పదకొండుచోట్ల తనిఖీలు చేసి ముగ్గురి నుంచి రూ.4 వేలు, 6వ జోన్‌లో ఏడు చోట్ల తనిఖీల్లో భాగంగా ఆరుగురి నుంచి రూ.7,800, ఏడో జోన్‌లో ఆరు చోట్ల జరిగిన తనిఖీల్లో ముగ్గురి నుంచి రూ.1,300, 8వ జోన్‌లో పన్నెండుచోట్ల చేపట్టిన తనిఖీల్లో పది దుకాణాల నుంచి రూ.11 వేలు అపరాధ రుసుం కింద వసూలు చేసినట్టు చెప్పారు. ఈ టీమ్‌లు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. ప్రజల ఆహార భద్రతతో పాటు, ప్లాస్టిక్ నియంత్రణ దిశగా వ్యాపారుల్లో మార్పు తీసుకురావడమే వీటి లక్ష్యమన్నారు. తద్వారా ప్లాస్టిక్ రహిత, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ కృషిచేస్తుందని కమిషనర్ పేర్కొన్నారు. నగరంలో ఆహార విక్రయదారులు పరిశుభ్రతతో పాటు నాణ్యతపై దృష్టిసారించాలన్నారు. ఆహార ఉత్పత్తుల్లో కల్తీకి పాల్పడినా, నిషేధిత ప్లాస్టిక్ వినియోగించినా హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు ఇతర ఆహార విక్రయ కేంద్రాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఉక్కులో ప్రైవేటు క్యాంటీన్లు మూసివేత!

... 5వ పేజీ తరువాయి

యత్నించారు. కానీ యాజమాన్యం అవకాశం ఇవ్వలేదు. మొత్తం క్యాంటీన్లన్నీ బుధవారం పూర్తిగా మూయించేసింది. వాటిలో పనిచేసే వారికి ఇచ్చే గేట్‌పాస్‌లను మంగళవారం సాయంత్రమే రద్దు చేసింది. అంటే ఆయా పనివారు ఇప్పుడు ప్లాంటులోకి వచ్చే అవకాశం లేకుండా చేసింది. పోనీ ప్రత్యామ్నాయంగా కార్మికుల కోసం ఏమైనా ఏర్పాటుచేసిందా? అంటే అదీ లేదు.

అధికారిక క్యాంటీన్లు అక్కడక్కడా ఉన్నా అంత దూరం వెళ్లి రావడానికి కనీసం అరగంట సమయం పడుతుంది. ప్రస్తుతం పూర్తిస్థాయి ఉత్పత్తి పేరుతో రోజుకు 12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇటువంటి తరుణంలో అంతదూరం వెళ్లి టీ తాగి వస్తామంటే విభాగాధిపతులు అంగీకరించే అవకాశం లేదు. పనిచేసే స్థలంలో కార్మికులకు మౌలిక సదుపాయాలు తీసివేయడాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం సమర్థిస్తున్నదేమో మరి. యాజమాన్యం ఏమి చేసినా పైనుంచి ఎవరూ ప్రశ్నించిన దాఖలాలు కనిపించడం లేదు.

ఉత్సాహంగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు

కంచరపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): డిజైన్ థింకింగ్ న్యూమరికల్ అప్రోచ్ శిక్షణలో భాగంగా బుధవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మూడో రోజు శిక్షణ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ల్యాబ్ కార్ప్ డైరెక్టర్ డా.మల్లికార్జున్ ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ అంశాలను సమగ్రంగా వివరించారు.'డిజైన్ మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ డిజైన్ ఫర్ అసెంబ్లీ' అనే అంశంపై వివరిస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ నాణ్యత కలిగిన ఉత్పత్తులను తయారు చేయవచ్చునన్నారు. రెండో సెషన్‌లో గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.ప్రేమ్‌కుమార్ సింగ్ గణిత సబ్జెక్టులో వివిధ అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్, డా.పి.బాష, డా.సీహెచ్.రాజు, ఎం.భరణి తదితరులు పాల్గొన్నారు.

క్రేన్ పైనుంచి జారిపడి ఉక్కు ఉద్యోగి మృతి



పైడికొండ మృతదేహం

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్‌షాప్ (ఎస్ఎంఎస్)-2 విభాగంలో క్రేన్‌పై నుంచి జారిపడి ఓ ఉద్యోగి మృతిచెందాడు. విభాగం ఉద్యోగులు తెలిపిన వివరాలివి ఉన్నాయి.... వడ్లపూడి ఉక్కు నిర్వాసిత ప్రాంతానికి చెందిన కె.పైడికొండ (45) బుధవారం బి షిఫ్ట్‌కు హాజరయ్యాడు. రాత్రి 9.30 గంటల సమయంలో సుమారు క్రేన్‌పై సుమారు 60 అడుగుల ఎత్తు నుంచి జారి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వన్‌టౌన్‌లో ఒరిగిన భారీ భవనం

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదు చేయడంతో బుధవారం రాత్రి జీవీఎంసీ అధికారులు, పోలీసులు, దక్షిణ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌తో అక్కడకు చేరుకున్నారు. పది కుటుంబాల వారిని తక్షణమే ఖాళీ చేయాలని ఆదేశించారు. బిల్డింగ్ యజమానులకు జీవీఎంసీ అధికారులు నోటీసులు జారీచేశారు. పక్కనే ఉన్న భరణి ఫంక్షన్ హాల్ కూడా కొద్దిగా పక్కకు ఒరిగినట్టు అధికారులు గుర్తించారు. కళిరెడ్డి బిల్డింగ్ యజమాని జీ+2 అనుమతులు తీసుకొని జీ+5 నిర్మాణం చేపట్టారు. ధరణి ఫంక్షన్ హాల్ కూడా జీ+2 అనుమతులు తీసుకొని జీ+3 నిర్మాణం చేపట్టినట్టు అధికారులు గుర్తించారు.

టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అంకురార్పణ

... 5వ పేజీ తరువాయి

వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ యువతకు ఈ కేంద్రం బాసటగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా టై వైజాగ్, డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్, టీహబ్ ఐఐటీ హైదరాబాద్, ఆల్కోవ్ పార్టనర్స్, ఐటాప్, అట్లాస్ కాన్సిలియో, లయా గ్రీన్ వెంచర్స్, సీఐఐ యంగ్ ఇండియన్స్‌తో అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లు ప్రసంగించగా, జీఎంఆర్ ప్రతినిధి టాటా తేజ, దివీస్ ల్యాబ్స్ నుంచి డాక్టర్ సురేశ్, ఆర్సెలర్ మిట్టల్ నుంచి ఎం.రవీంద్రనాథ్, ఏయూ నుంచి రిజిస్ట్రార్ ధనుంజయరావు, గీతం నుంచి డాక్టర్ రాజా పప్పు, ఐఐపీఈ నుంచి డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

ఆలిండియా రైల్వే బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ వాల్తేరు డివిజన్ నిర్వహిస్తున్న అఖిల భారత పురుషుల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీ బుధవారం ప్రారంభమైంది. వాల్తేరు రైల్వే స్పోర్ట్సు ఎరీనాలో జరుతున్న ఈ పోటీలకు డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఈకార్వో అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నీలో పాల్గొంటున్న వివిధ జోన్ల క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇ.శాంతారాం, స్పోర్ట్సు ఆఫీసర్ ఎం.హరినాథ్, సహాయ క్రీడాధికారులు పాటిల్, సాహు, ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు మ్యాచ్‌ల్లో ఆతిథ్య తూర్పుకోస్తారైల్వే ఓటమి

తొలిరోజు జరిగిన లీగ్ మ్యాచ్‌లలో ఆతిథ్య తూర్పుకోస్తారైల్వేకు ఓటమి ఎదురైంది. వెస్ట్రన్ రైల్వేతో జరిగిన మ్యాచ్‌లో తొలి సెట్‌లో 35-30 స్కోరుతో పోటీ ఇచ్చిన తూ.కో రైల్వే, రెండో సెట్‌లో 35-19 స్కోరుతో చతికిలపడ్డారు. రెండో మ్యాచ్‌లో సౌత్ ఈస్ట్రన్ రైల్వేతో 2-1 స్కోరుతో ఓడింది. మిగిలిన లీగ్ మ్యాచ్‌ల ఫలితాలు: ఐసీఎఫ్ 2-0 స్కోరుతో ఎస్‌సీఆర్‌పై, సదరన్ రైల్వే 2-0 స్కోరుతో సౌత్ వెస్ట్రన్ రైల్వేపై, సౌత్ ఈస్ట్రన్ రైల్వే 2-1 స్కోరుతో సౌత్ వెస్ట్రన్ రైల్వేపై, సదరన్ రైల్వే 2-0 స్కోరుతో సౌత్ సెంట్రల్ రైల్వేపై, ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) 2-0 స్కోరుతో వెస్ట్రన్ రైల్వేపై, సదరన్ రైల్వే 2-0 స్కోరుతో వెస్ట్రన్ రైల్వేపై గెలుపొందాయి.

1579 మంది అనర్హులు

... 5వ పేజీ తరువాయి

మండలాల్లో 401 మంది ఉన్నట్టు గుర్తించారు. అయితే రీవెరిఫికేషన్‌లో 125 మంది 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్నట్టు నిర్ధారించారు. మరో 182 మంది 60 ఏళ్లు దాటినవారు కావడంతో వృద్ధాప్య పింఛన్లు తీసుకునేందుకు అర్హులుగా తేల్చారు. ఈ 307 మందికి త్వరలో సొమ్ము బట్వాడా చేస్తారు. కాగా దివ్యాంగ పింఛన్లు నిలిపివేతకు సంబంధించి నోటీసులు జారీచేస్తున్నారు. నోటీస్ అందుకున్న నెల రోజులలో జోనల్ కమిషనర్/ఎంపీడీవోకు అప్పీల్ చేసుకునే అవకాశం ఇచ్చారు. అయితే కొందరు పింఛన్‌దారులు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. గతంలో తమకు 40 శాతం అంగవైకల్యం ఉన్నట్టు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారని, ఇప్పుడు అవే పత్రాలు తప్పని ఎలా చెబుతారని నిలదీస్తున్నారు.

ప్లానింగ్ పట్టని నిర్మాణాలు

- పలు చోట్ల ప్లాన్ అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు
- ఇరుకు సంధుల్లో బహుళ అంతస్తుల భవనాలు
- కళ్లకు గంతలు కట్టుకున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

మద్దిలపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23వ వార్డులో ప్లాన్ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇరుకు సందుల్లో బహుళ అంతస్తులు కడుతున్నారు. అడుగు స్థలం కూడా సెట్‌బ్యాక్‌విడిచి పెట్టకుండా నిర్మాణాలు చేస్తున్నారు. గాలి, వెలుతురు మాట దేవుడెరుగు.. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే సహాయానికి నలుగురు వ్యక్తులు కూడా ఫ్రీగా వెళ్లే పరిస్థితి లేకుండా కట్టడాలు ఏర్పాటవుతున్నా... జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు పట్టించుకోకపోవడం గమనార్హం. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలిచ్చింది.

నిర్మాణాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉత్తర్వులిచ్చింది. అయితే సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు కనీసం పట్టించుకోవడం లేదనే ఆరోపనలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడికక్కడే ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతుంటే నోటీసులతో సరిపెడుతున్నారు.


మద్దిలపాలెం చేపల బజార్ వద్ద నిర్మిసున్న బహుళ అంతస్తుల భవనం


కేఆర్‌ఎం కాలనీ శివాలయం వీధి రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న పెంట్‌హౌస్

మద్దిలపాలెం చేపల బజార్ సందులో ఓ వ్యక్తి మూడు అంతస్తులకు అనుమతులు పొంది, అయిదు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. 6 యూనిట్లకు ప్లాన్ మంజూరు కాగా, ఏకంగా 16 యూనిట్ల నిర్మాణం చేపట్టారు. ఈ విషయం టౌన్ ప్లానింగ్ అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోలేదు. శ్లాబ్ నిర్మాణానికి ఏర్పాటు చేసిన సెంట్రింగ్ తొలగించి వెళ్లిపోయారు. కొద్ది రోజులకే సదరు బిల్డర్ ప్లానింగ్ అధికారులకు ప్రసన్నం చేసుకుని తొలగించిన నిర్మాణాలను దర్జాగా కట్టుకున్నాడు. ఈ అక్రమ నిర్మాణాల వెనుక రూ.లక్షలు చేతులు మారినట్టు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా అక్రమ అంతస్తులకు బయట వైపు సున్నాలు వేసేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులే సూచించినట్టు చెబుతున్నారు. సున్నాలు వేసేస్తే అక్రమ నిర్మాణాలు కాస్త సక్రమ నిర్మాణాలుగా మారిపోతాయని సలహా ఇచ్చారంటా? అందుకే నిర్మాణదారుడు ముందుగా బయటవైపు సున్నాలు వేసి లోపల పనులు ధీమాగా చేసుకుంటున్నాడు.

కేఆర్‌ఎం కాలనీలోని శివాలయం రోడ్డులో మద్దిలపాలెం గ్రేస్ చర్చ్ వెనుక సందులో ఓ నిర్మాణదారుడు నిబంధనలకు విరుద్ధంగా భారీ భవన నిర్మాణం చేపడుతున్నారు. ఇక్కడ కూడా జీ ప్లస్-2 అనుమతులు తీసుకుని జీ ప్లస్-4 నిర్మాణం జరుగుతోంది జీవీఎంసీ నిబంధనల మేరకు రోడ్డు ఫేసింగ్ వైపు ఆరున్నర అడుగులు, మిగతా మూడు వైపులా అయిదు అడుగుల స్థలం సెట్‌బ్యాక్స్ కింద విడిచి పెట్టాలి. సదరు నిర్మాణదారుడు స్థలం నాలుగు వైపులా కనీసం అడుగు స్థలం కూడా సెట్‌బ్యాక్స్‌గా విడిచిపెట్టలేదు. నిబంధనలు పట్టించుకోకుండా అడ్డగోలుగా భవనం కడుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. కేఆర్‌ఎం కాలనీ శివాలయం వీధి రోడ్డులో మరో నిర్మాణదారుడు జీప్లస్-2 అనుమతులు పొంది పెంట్ హౌస్ నిర్మాణం చేస్తున్నారు. ఎటువంటి సెట్‌బ్యాక్స్ విడిచిపెట్టకుండా నిర్మాణం చేస్తున్నా అధికారులు మౌనం దాల్చడం గమనార్హం. కాగా, ఈ అక్రమ భవనాల నిర్మాణాల గురించి అడగ్గా.. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మధుసూధనరావు అనుమతుల ప్రకారమే నిర్మాణాలు చేపడుతున్నారంటూ చెప్పడం గమనార్హం.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకోండి

- పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు


ప్రసంగిస్తున్న పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా పరిశ్రమలను ఏర్పాటు స్థాపించదలచిన వారికి ప్రభుత్వం అనేక ప్రోత్సహకాలను ఇస్తోందని, వాటిని వినియోగించుకోవాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు అన్నారు. ఆగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలపై అవగాహన కార్యక్రమాన్ని ఎంవీపీ కాలనీలోని భద్రం సామాజిక భవనంలో బుధవారం నిర్వహించారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్, టీమ్ ఇండస్ట్రీస్ కన్సల్టెన్సీ, సర్వీసెస్, ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీమ్ ఇండస్ట్రీస్ కన్సల్టెన్సీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ డి.మధుసూదనరావు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్‌పర్సన్ గీతా శ్రీకాంత్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డెప్యూటీ జనరల్ మేనేజర్ ఏవీ రమణమూర్తి తదితరులు మాట్లాడుతూ.. కొత్తగా వ్యాపారాలు ప్రారంభించదలచినవారు, ఇప్పటికే పరిశ్రమలు నెలకొల్పిన వారికి మార్గదర్శనం కల్పించడంతో పాటు, ప్రభుత్వ ఎంఎస్ఎంఇ పథకాలు, రుణాలు, రాయితీలపై అవగాహన కల్పించారు.

శివాజీపాలెంలో అన్న సంతర్పణ


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వెలగపూడి ప్రతాప్

మద్దిలపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డు శివాజీపాలెంలోని శ్రీకృష్ణుడి ఆలయం వద్ద శ్రీకృష్ణ సేవాసంఘం ఆధ్వర్యంలో బుధవారం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్ పాల్గొని భక్తులకు ప్రసాదం వడ్డించారు. ముందుగా ఆయన రాధాకృష్ణులకు దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి పూజలు జరిపి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఒమ్మి అప్పారావు, దువ్వి స్వామి తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి శాప్ జోనల్ క్రీడా పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ నేతృత్వంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఈ నెల 22, 23 తేదీల్లో అమరావతి చాంపియన్‌షిప్ పేరుతో జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనుందని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అండర్-22 విభాగంలో ఆర్చరీ, అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్ పోటీలు, అండర్-19 విభాగంలో బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో విశాఖ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల జట్ల నుంచి పురుషులు, మహిళల విభాగాలకు సుమారు 1800 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. రైల్వే స్పోర్ట్సు ఎరీనాలో బాక్సింగ్, చంద్రంపాలెం స్కూల్‌లో బాస్కెట్‌బాల్ పోటీలు జరుగుతాయని, మిగిలిన క్రీడాంశాల పోటీలు కొమ్మాదిలోని ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు కాంప్లెక్సులో జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడాప్రాంగణాలలో తాగునీరు, పారిశుధ్యం, సంచార మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని మదురవాడ జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. వైద్య సదుపాయం నిమిత్తం అంబులెన్స్, మందులు, వైద్యులను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. జోనల్ స్థాయిలో గెలుపొందినవారు ఈ నెల 24 నుంచి 26 వరకు తిరుపతిలో జరగనున్న తుది పోటీల్లో పాల్గొంటారని, వారికి బస్సు రవాణా సదుపాయం కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, జోనల్ కమిషనర్ కనకదుర్గ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఛాయాచిత్రాలు చరిత్రకు ఆనవాళ్లు

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు


ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న పల్లా శ్రీనివాసరావు తదితరులు

బీచ్‌రోడ్డు, ఆగస్టు 20, (ఆంధ్రజ్యోతి) : ఛాయాచిత్రాలు చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచిపోతాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బీచ్ రోడ్డు వద్ద ఉన్న విశాఖ మ్యూజియంలో వైజాగ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను బుధవారం ఆయన తిలకించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ అపురూప దృశ్యాలను కళ్లకు కట్టినట్టుగా చూపించిరంటూ ఫొటోగ్రాఫర్లను అభినందించారు. అద్భుత దృశ్యాలు, అపురూప సంఘటలను శాశ్వతంగా నిలిచేలా శక్తి ఫొటోగ్రాఫర్లకు మాత్రమే సొంతమని పేర్కొన్నారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాల వల్ల వృత్తిపరమైన పోటీతో పాటు సామాజిక చైతన్యం పెంపొందించే అవకాశం ఉంటుందన్నారు.


ఫొటోలను తిలకిస్తున్న నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ఛాయాచిత్రాలు చూస్తుంటే ఆయా సంఘటన జరిగినప్పుడు ఫొటోగ్రాఫర్ల సమయస్ఫూర్తి, వారిలోని ప్రతిభాపాటవాలు గుర్తించవచ్చన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల అభిరుచి, సామాజిక స్పృహ, ప్రతిభ స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఇక్కడ ఫొటో ఎగ్జిబిషన్ చూడడం ద్వారా విశాఖ అందాలు, ప్రకృతి జీవన స్థితిగతులు చూసే అవకాశం లభించిందని పేర్కొన్నారు. అలాగే మాజీ మంత్రి, సినీ నటి ఆర్కే రోజా ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ ప్రదర్శన చూస్తుంటే ఫొటోగ్రాఫర్ల ప్రతిభ, ఫొటోగ్రఫీ ప్రాధాన్యం స్పష్టమవుతోందన్నారు. కార్యక్రమంలో వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అధ్యక్షుడు వై.రామకృష్ణ, కార్యదర్శి ఎండీ నవాజ్, కోశాధికారి ఎ.శరత్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారుడు అంబిరెడ్డి మృతి


జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అంబిరెడ్డి

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మరడపాలెం గ్రామానికి చెందిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడు చిల్ల అంబిరెడ్డి (56) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. చిల్లపేట ఫుట్‌బాల్ జట్టులో ప్రధాన ఆటగాడిగా అనేక ప్రాంతాల్లో పోటీల్లో పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో అనేక సార్లు బహుమతులు పొందారు. తరువాత కొంతకాలం ఆర్మీలో పనిచేశారు. విధి నిర్వహణలో శరీరంలో కింది భాగం పనిచేయకపోవడంతో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఆ సమయంలో దివ్యాంగుల త్రోబాల్ పోటీలో పాల్గొని జాతీయ స్థాయిలో బహుమతి పొందారు. నాటి ప్రధాని వాజ్‌పేయి పురస్కారం కూడా అందించారు. కొంతకాలంగా అనారోగ్యం వల్ల మంచానికే పరిమితమయ్యారు. ఆయన మృతి పట్ల కార్మిక నాయకులు అప్పలరెడ్డి,ఆదినారాయణ, త్రినాథరెడ్డి, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

చెస్ టోర్నీలో నిధి కేశవరావుకు పసిడి పతకాలు



స్వర్ణ పతకాలతో నిధి కేశవరావు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల చదరంగం సంఘం నిర్వహించిన ప్రపంచ ఐపీసీఏ వ్యక్తిగత చెస్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన బి.నిధి కేశవరావు పతకాల పంట పండించింది. గోవాలో జరిగిన ఈ టోర్నీలో దేశానికి మూడు స్వర్ణ పతకాలు అందించింది. 20 దేశాల నుంచి సుమారు వంద మంది ప్రాతినిధ్యం వహించిన ఈ టోర్నీలో అండర్-15 జూనియర్ బాలికల విభాగంలో నిధికేశవరావు ఎత్తుకు పైఎత్తులతో ప్రతిభను ప్రదర్శించింది. స్టాండర్స్ చెస్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన నిధి...ర్యాపిడ్, బ్లిట్జ్ ఈవెంట్‌లోనూ పసిడి పతకాలు కైవసం చేసుకుంది. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ నుంచి పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకుంది. కోచ్‌లు జేఎస్.రాజు, సీహెచ్.నారాయణరావు, అప్పారావుల వద్ద శిక్షణ పొందుతున్న నిధికేశవరావు దేశానికి పతకాలు అందించడం గర్వకారణమని పలువురు అభినందించారు. ఈత క్రీడాకారిణిగానూ జాతీయ పారా స్విమ్మింగ్ టోర్నీలలో నిధి పతకాలు సాధించింది.

హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో డయాగ్నస్టిక్ ల్యాబ్ ప్రారంభం

- ఐవోసీఎల్ సీఎస్ఆర్ నిధులు రూ.8.93 కోట్లతో ఏర్పాటు


డయాగ్నస్టిక్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఐవోసీఎల్ డైరెక్టర్ రష్మి గోవిల్

అగనంపూడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో కీలకమైన డయాగ్నస్టిక్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం ఈ ల్యాబ్‌ను ఐవోసీఎల్ హెచ్‌ఆర్ విభాగం డైరెక్టర్ రష్మి గోవిల్, ఆస్పత్రి డైరెక్టర్ ఉమేశ్ మహంతి శెట్టి కలిసి ప్రారంభించారు. అనంతరం రష్మి గోవిల్ మాట్లాడుతూ హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ఇక్కడ తమ సంస్థ రూ.8.93 కోటుట్ల వెచ్చించి డయాగ్నస్టిక్ పరికరాలను సమకూర్చి ల్యాబ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దేశంలో క్యాన్సర్ రోగులు విపరీతంగా పెరుగుతున్నారని, అందువల్ల అందరూ ముందస్తు జాగ్రత్రలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐవోసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బిబూతి రంజన్ ప్రదాన, డైరెక్టర్ అండ్ స్టేట్ హెడ్ పియూష్ మిట్టల్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు పందిరి రాట


పందిరి రాటలో పాల్గొన్న మహిళలు, అసోసియేషన్ ప్రతినిధులు

ఆరిలోవ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలి యంగ్ బాయ్స్ యూత అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాల కోసం పందిరి రాటను బుధవారం వేశారు. ఈ ఏడాది భారీ ఎత్తున చవితి వేడుకలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దువ్వి సంతోష్, పాల్తేరు గిరి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం).
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గాజువాక, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్టీల్ సిటీ ఐటీఐలో మిగులు సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు 27వ తేదీన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు, 29న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు ఐటీఐను సంప్రందించాలని కోరారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 47, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 26, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 22, బీరకాయలు 38, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 42, దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటి కాయ (పె)10, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 58, బద్దచిక్కుడు 50, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75,కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 72, కీరదోస 34, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	103
లైవ్ ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

చెత్త తొలగించె.. అందమైన రంగవల్లులు వేయించె

- 16వ వార్డు శానిటరీ సిబ్బంది చర్యలపై స్థానికుల హర్షం



చెత్తను తొలగించిన రంగుల రంగవల్లికలు తీర్చిదిద్దిన కేఆర్‌ఎం కాలనీ పార్కు ప్రాంతం

వెంకోజీపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పది మంది తిరిగే చోటును అందంగా ఉంచుకుందాం... నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుదామనే సంకల్పాన్ని 16వ వార్డు శానిటరీ సిబ్బంది పూనుకున్నారు.

క్రమంలో వార్డులోని కేఆర్‌ఎం కాలనీ పార్కు వద్ద ప్రతిరోజు పేరుకుపోతున్న చెత్తను తొలగించి, ఆ ప్రాంతంలో రంగు రంగుల హరివిల్లులను రూపుదిద్దారు. పది మంది నడియాడి.. అలసత్వం, ఆయాసం పోగొట్టుకుని ఆరోగ్యాన్ని పొందేందుకు వచ్చే ప్రాంతంలో ప్రతిరోజూ చెత్త దర్శనమిచ్చేది. దీని నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించి, సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు వార్డు శానిటరీ సిబ్బంది నడుం బిగించారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు నేతృత్వంలో శుభ్రం మేస్త్రీలు జి.బాబు, నమ్మిచిన్నరాజు పారిశుద్య సిబ్బందితో పార్కు వద్ద పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించి, ఆ ప్రాంతంలో ముగ్గులను వేయించారు. ఇక్కడ చెత్తను వేసేవారు కనీసం ఈ ముగ్గులను చూసైనా చెత్తను వేయకుండా ఉంటారనే ఆలోచనతో ఈ చర్యలు చేపట్టినట్టు పారిశుధ్య విభాగం అధికారులు తెలిపారు. ఇలా వార్డులోని మరిన్ని ప్రాంతాలను చెత్త రహిత ప్రాంతాలుగా, సర్వాంగ సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని వారు పేర్కొన్నారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


చెత్త తొలగించక ముందు పరిస్థితి (ఫైల్)

గవర్నర్‌ను కలిసిన ఏయూ వీసీ రాజశేఖర్


గవర్నర్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య జీపీ రాజశేఖర్ బుధవారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అభివృద్ధి, శతాబ్ది ఉత్సవాల నిర్వహణ తదితర అంశాలపై గవర్నర్‌కు వీసీ వివరించారు. 91, 92వ స్నాతకోత్సవ నిర్వహణ అంశాలను వివరించారు.

భవిష్యత్తులో రోలర్ స్కేటింగ్‌కు చిరునామాగా విశాఖ

- రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు


పతకాలు సాధించిన స్కేటర్లతో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

మద్దిలపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్‌లో రోలర్ స్కేటింగ్‌కు విశాఖ చిరునామాగా మారుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో బుధవారం ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పతకాలు సాధించిన స్కేటర్లు, వారి కోచ్‌లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులకు మరింత ప్రోత్సహించేందుకు అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించేలా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు సంబంధించి కొత్త విధానాన్ని తీసుకువచ్చి క్రీడాకారులకు మరింత ప్రోత్సహిస్తోందన్నారు. అలాగే పతకాలు సాధించిన స్కేటర్లకు అభినందనలు తెలియజేశారు.

వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి చంద్రనాయుడు కృషి చేస్తున్నారన్నారు. విశాఖ స్కేటర్లు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి నగరానికి మరింత పేరుప్రఖ్యాతలు తీసుకువచ్చారన్నారు. విశాఖ స్కేటింగ్ అభివృద్ధికి వీఎంఆర్డీఏ తరపున ఎలాంటి సహాయం కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వీఎంఆర్డీఏ పార్కులో స్కేటింగ్ అభివృద్ధి కోసం రూ.3.50 కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో స్కేటింగ్ బోర్డు నిర్మిస్తున్నామన్నారు.

అనంతరం ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్, విశాఖ జిల్లా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ ఆధ్వర్యంలో పతకాలు సాధించిన స్కేటర్లు, వారి కోచ్‌లకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్, అసోసియేషన్ ప్రతినిధులు భగీరథకుమార్, జె.సుధాకరరెడ్డి, థామస్, శీలం లక్ష్మణ్, వై.రమేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా పార్కింగ్ స్థలాల ఆక్రమణ

» చోద్యం చూస్తున్న యంత్రాంగం


ఓ వాణిజ్య దుకాణం ముందు అడ్డంగా పెట్టిన బారికేడ్లు


రోడ్డుపై నిలిపిన కార్లు

మహారాణిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వాహనాలు పార్కింగ్ చేసుకొనే స్థలాలను షాపింగ్ యాజమాన్యాలు కబ్జా చేయడంతో వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలపాల్సి వస్తోంది. ట్రాఫిక్ పోలీసులు ఇలాంటి వాహనాల ఫొటోలు తీసి జరిమానా చెల్లించాలంటూ నోటీసులు పంపుతుండడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కలెక్టరేట్ నుంచి కేజీహెచ్ మీదుగా లేపాక్షి జంక్షన్ వైపు వచ్చే రహదారిపై ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. కేజీహెచ్ నుంచి ఈ మార్గం నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. కేజీహెచ్ ఓపీ గేట్ నుంచి లేపాక్షి జంక్షన్ వరకు వాహనదారులతో రద్దీగా ఉంటూ అనేకసార్లు ట్రాఫిక్ నిలిచిపోతుంది. అత్యంత రద్దీగా కనిపించే ఈ ప్రాంతంలో రహదారి చిన్నది కావటంతో వన్ వే అమలు చేశారు. మరోవైపు వాహనదారులు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తుండటం ట్రాఫిక్ రద్దీకి కారణమవుతోంది. కొంతమంది యజమానులు తమ షాపు ముందర పార్కింగ్ స్థలాలు ఆక్రమించి వాహనాలు పార్కింగ్ చేయకుండా సెక్యూరిటీ గార్డులను వినియోగిస్తున్నారు. వారి వాహనాలతోపాటు షాపులకు వచ్చే వారి వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. వారితో వివాదం ఇష్టంలేక వాహనదారులు రోడ్డు మీద పార్కింగ్ చేస్తున్నారు. కానీ అక్కడ 'నో పార్కింగ్ జోన్' అంటూ ట్రాఫిక్ పోలీసులు బోర్డు పెడుతున్నారు. వాహనాల ఫొటోలు తీసి చలానాలు పంపుతున్నారని వాహనదారులు వాపోతున్నారు. కొంతమంది పబ్లిక్ స్థలం కబ్జా చేయడమే కాకుండా ఏకంగా తాడు కట్టి మరీ ఎవరూ పార్కింగ్ చేయకుండా అడ్డుకుంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు చోద్యం చూస్తున్నారు తప్ప కబ్జాదారుల నుంచి పార్కింగ్ స్థలాలను స్వాధీనం చేసుకోవడం లేదు. ట్రాఫిక్ పోలీసు అధికారులు ఆక్రమిత పార్కింగ్ స్థలాలను స్వాధీనం చేసుకుని వాహనాల పార్కింగ్‌కు వీలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఉద్యోగాల క్రమబద్ధీకరణకు వినతి


కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి వినతిపత్రం ఇస్తున్న నర్సింగ్ పోరాట కమిటీ ప్రతినిధులు

మహారాణిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సేవలను క్రమబద్ధీకరించి, ఇతర భత్యాలు, వంద శాతం స్థూల వేతనం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. కేజీహెచ్‌లో పోరాట కమిటీ ప్రతినిధులు బుధవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పదేళ్లుగా రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో విధులు నిర్వహిస్తూ, వృత్తిపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో వైద్య సేవలు అందిస్తూ అనేకమంది సహచర సిబ్బంది మృతిచెందారని గుర్తుచేశారు. తక్కువ జీతం పొందినప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటూనే యోధులుగా పనిచేశామని పేర్కొన్నారు. హెల్త్ కార్డు, కరవు భత్యం, ఇంటి అద్దె, మెడికల్ లీవ్‌లు, నైట్ డ్యూటీ అలవెన్స్ ఇవ్వాలని అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. పరస్పర అంగీకార బదిలీలను అనుమతించాలని కోరారు. సంఘం నాయకులు సత్యనారాయణ, పద్మాక్షి, శోభ, శ్రీమణి తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో సికిల్‌సెల్ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

కాంపెటెన్స్ (సీవోసీ)ను కేజీహెచ్‌లో ఏర్పాటుచేసేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ సెంటర్‌లో సికిల్‌సెల్ ఎనీమియా జబ్బు స్థాయి తెలుసుకునేందుకు అవసరమైన జన్యు పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుకు అవసరమయ్యే రూ.4 కోట్లను కేంద్రం మంజూరుచేసింది. మరో మూడు నెలల్లో ఇక్కడ జన్యు పరీక్షలను ప్రారంభించేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ నిధులతో ఈ సీవోసీ ఏర్పాటుచేయనున్నారు. ఈ సెంటర్‌లో భార్యభర్తల నుంచి రక్త నమూనాలను సేకరించి వారికి సికిల్‌సెల్ ఎనీమియా ఉందా?, ఒకవేళ ఉంటే ఏ స్థాయిలో ఉందన్నది నిర్ధారించనున్నారు. వారి నుంచి పిల్లలకు వ్యాధి సంక్రమిస్తుందా?, ...అన్నది తెలుసుకునే పరీక్షలను కూడా చేస్తారు. అలాగే, శిశువుల నుంచి సేకరించిన రక్త నమూనాలను ఇక్కడ పరీక్షిస్తారు. దీనివల్ల ముందుగానే సికిల్‌సెల్ ఎనీమియా సమస్యను గుర్తించి అవసరమైన వైద్య సేవలను అందించేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు అవసరమైన పరికరాల కొనుగోలుకు ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు ఇప్పటికే టెండర్లు పిలిచారు. జన్యుపరీక్ష కేంద్రాన్ని ఆస్పత్రిలోని ఎమర్జన్సీ వార్డు సమీపంలో ఏర్పాటు చేయనున్నారు. దేశంలో గిరిజనులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ఆరోగ్య సమస్యల్లో సికిల్‌సెల్ ఎనీమియా ఒకటిగా కేంద్రం గుర్తించింది. శరీరంలోని ఎర్ర రక్తకణాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపే జన్యుపరమైన రుగ్మతను సికిల్‌సెల్ ఎనీమియాగా పేర్కొంటారు. గత కొన్నాళ్లుగా గిరిజన ప్రాంతాల్లోని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ సమస్యను 2047 నాటికి దేశంలో పూర్తిగా నిర్మూలించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగానే దేశవ్యాప్తంగా సికిల్‌సెల్ ఎనీమియా అధికంగా ఉన్న ఏపీ సహా 17 రాష్ట్రాల్లో జన్యుపరీక్షల కేంద్రాలను ఏర్పాటుచేస్తోంది.

నేడు, రేపు సహకార సంఘ సభ్యుల వివరాల సేకరణ

అక్కయ్యపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): డైమండ్ పార్కు సమీపంలోని 'ది స్నేహ పరస్పర సహాయక సహకార సంఘం'లో జరిగిన అవకతవకలపై గురువారం విచారణ జరుపుతామని అధికారి టి.నందన ఒక ప్రకటనలో తెలిపారు. విచారణలో భాగంగా సంఘంలో మదుపరుల వివరాలు, ఏడాదిలో వారు ఎంత మొత్తం మదుపు చేశారు? వారికి రావాల్సిన మొత్తం సొమ్ము వివరాలు తెలుసుకుంటామన్నారు. సంఘంలో పొదుపు చేసినవారు గురు, శుక్రవారాల్లో డైమండ్ పార్కు వద్ద ఉన్న డివిజనల్ సహకార అధికారి కార్యాలయంలో ఉదయం 10-30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య బాండు వివరాలు తెలియజేయాలని సూచించారు.

ఫుట్‌బాల్ క్రీడాకారుడు అంబిరెడ్డి మృతి


జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అంబిరెడ్డి (ఫైల్)

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మరడపాలెం గ్రామానికి చెందిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడు చిల్ల అంబిరెడ్డి (56) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. చిల్లపేట ఫుట్‌బాల్ జట్టులో ప్రధాన ఆటగాడిగా అనేక ప్రాంతాల్లో పోటీల్లో పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో అనేక సార్లు బహుమతులు పొందారు. తరువాత కొంతకాలం ఆర్మీలో పనిచేశారు. విధి నిర్వహణలో శరీరంలో కింది భాగం పనిచేయకపోవడంతో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఆ సమయంలో దివ్యాంగుల త్రోబాల్ పోటీలో పాల్గొని జాతీయ స్థాయిలో బహుమతి పొందారు. నాటి ప్రధాని వాజ్‌పేయి పురస్కారం కూడా అందించారు. కొంతకాలంగా అనారోగ్యం వల్ల మంచానికే పరిమితమయ్యారు. ఆయన మృతి పట్ల కార్మిక నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉక్కులో ప్రైవేటు క్యాంటీన్లు మూసివేత!

... 5వ పేజీ తరువాయి

యత్నించారు. కానీ యాజమాన్యం అవకాశం ఇవ్వలేదు. మొత్తం క్యాంటీన్లన్నీ బుధవారం పూర్తిగా మూయించేసింది. వాటిలో పనిచేసే వారికి ఇచ్చే గేట్‌పాస్‌లను మంగళవారం సాయంత్రమే రద్దు చేసింది. అంటే ఆయా పనివారు ఇప్పుడు ప్లాంటులోకి వచ్చే అవకాశం లేకుండా చేసింది. పోనీ ప్రత్యామ్నాయంగా కార్మికుల కోసం ఏమైనా ఏర్పాటుచేసిందా? అంటే అదీ లేదు.

అధికారిక క్యాంటీన్లు అక్కడక్కడా ఉన్నా అంత దూరం వెళ్లి రావడానికి కనీసం అరగంట సమయం పడుతుంది. ప్రస్తుతం పూర్తిస్థాయి ఉత్పత్తి పేరుతో రోజుకు 12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇటువంటి తరుణంలో అంతదూరం వెళ్లి టీ తాగి వస్తామంటే విభాగాధిపతులు అంగీకరించే అవకాశం లేదు. పనిచేసే స్థలంలో కార్మికులకు మౌలిక సదుపాయాలు తీసివేయడాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం సమర్థిస్తున్నదేమో మరి. యాజమాన్యం ఏమి చేసినా పైనుంచి ఎవరూ ప్రశ్నించిన దాఖలాలు కనిపించడం లేదు.

టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అంకురార్పణ

... 5వ పేజీ తరువాయి

వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ యువతకు ఈ కేంద్రం బాసటగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా టై వైజాగ్, డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్, టీహెచ్ ఐఐటీ హైదరాబాద్, ఆల్కోవ్ పార్టనర్స్, ఐటాప్, అట్లాస్ కాన్సిలియో, లయా గ్రీన్ వెంచర్స్, సీఐఐ యంగ్ ఇండియన్స్‌తో అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లు ప్రసంగించగా, జీఎంఆర్ ప్రతినిధి టాటా తేజ, దివీస్ ల్యాబ్స్ నుంచి డాక్టర్ సురేశ్, ఆర్సెలర్ మిట్టల్ నుంచి ఎం.రవీంద్రనాథ్, ఏయూ నుంచి రిజిస్ట్రార్ ధనుంజయరావు, గీతం నుంచి డాక్టర్ రాజా పప్పు, ఐఐపీఈ నుంచి డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

దాతలు దయతలిస్తే సైకిల్ చాంపియన్‌షిప్‌కు పోటీపడతా

» జాతీయ పోటీలకు టైమ్ ట్రయల్ బైక్ కొనే శక్తిలేక రవికిరణ్ నిరీక్షణ


సైకిల్ బైక్‌తో రవికిరణ్

మహారాణిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు సైకిలింగ్‌లో అనేకసార్లు రాష్ట్ర స్థాయిలో చాంపియన్‌గా నిలిచిన కె.వంశీకిరణ్ (22) జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేందుకు సిద్ధంగా ఉన్నాడు. నగరంలో దక్షిణ నియోజకవర్గానికి చెందిన ఈ యువ సైకిలిస్టుకు ఖరీదైన సైకిల్ కొనుగోలు చేసేందుకు ఆర్థిక సమస్య అడ్డంకిగా మారింది. బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం సమీపంలో మట్టా వెంకటప్పయ్య వీధిలో నివాసం ఉంటున్న వంశీకిరణ్ డిగ్రీ చదివాడు. రోడ్డు సైకిలింగ్‌లో ఇప్పటికే రాష్ట్ర చాంపియన్‌గా నిలిచాడు. రాష్ట్రం తరఫున మూడు చాంపియన్‌షిప్‌లకు ప్రాతినిధ్యం వహించాడు, ఓసారి జాతీయ స్థాయిలో పోటీపడ్డాడు. త్వరలో జరగనున్న నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాలని అభిలషిస్తున్నాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను మెరుగు పరుచుకోవటానికి సుమారు రూ.8.25 లక్షల విలువైన టైమ్ ట్రయిల్ (టీటీ) బైక్ (సైకిల్) అవసరం. ఈ సైకిల్ కొనుగోలు చేయటానికి అతడి వద్ద ధనం లేదు. కలెక్టర్, పోలీసు కమిషనర్‌లకు విజ్ఞప్తి చేయడంతో ప్రభుత్వం నుంచి కొంత ఆర్థిక సహాయం అందింది. సుమారు రూ.6.5 లక్షల వ్యక్తిగత రుణం పొందాడు. ఇంకా సుమారు రూ.1.75 లక్షలు అవసరం. ఎవరైనా ప్రోత్సాహం అందించాలని వంశీకిరణ్ ఆశగా ఎదురు చూస్తున్నాడు. రాష్ట్రానికి, దేశానికి కీర్తి సంపాదించాలని కోరుకుంటున్న ఈ యువ సైకిలిస్టు తన స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు క్రీడాభిమానులు, దాతలు, శ్రేయోభిలాషుల సహకారం కోసం ఎదురుచూస్తున్నాడు.

చెస్ టోర్నీలో నిధికేశవరావుకు పసిడి పతకాలు


స్వర్ణ పతకాలతో నిధి కేశవరావు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల చదరంగం సంఘం నిర్వహించిన ప్రపంచ ఐపీసీఏ వ్యక్తిగత చెస్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన బి.నిధికేశవరావు పతకాల పంట పండించింది. గోవాలో జరిగిన ఈ టోర్నీలో దేశానికి మూడు స్వర్ణ పతకాలు అందించింది. 20 దేశాల నుంచి సుమారు వంద మంది ప్రాతినిధ్యం వహించిన ఈ టోర్నీలో అండర్-15 జూనియర్ బాలికల విభాగంలో నిధికేశవరావు ఎత్తుకు పైఎత్తులతో ప్రతిభను ప్రదర్శించింది. స్టాండర్డ్ చెస్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన నిధి....ర్యాపిడ్, బ్లిట్జ్ ఈవెంట్‌లోనూ పసిడి పతకాలు కైవసం చేసుకుంది. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ నుంచి పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకుంది. కోచ్‌లు జేఎస్.రాజు, సీహెచ్.నారాయణరావు, అప్పారావుల వద్ద శిక్షణ పొందుతున్న నిధికేశవరావు దేశానికి పతకాలు అందించడం గర్వకారణమని పలువురు అభినందించారు. ఈత క్రీడాకారిణిగానూ జాతీయ పారా స్విమ్మింగ్ టోర్నీలలో నిధి పతకాలు సాధించింది.

ప్రైవేటు కోసమే స్టీల్‌ప్లాంట్ ముస్తాబు

» కేంద్రం వైఖరికి వంతపాడుతున్న కూటమి ప్రభుత్వం

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు ఆరోపణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

మహారాణిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కానివ్వబోమని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నాయకులు నేడు కేంద్రం నిర్ణయాలను సమర్థిస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు ఆరోపించారు. విశాఖ స్టీల్‌ను ముస్తాబు చేసి ప్రైవేటుకు అప్పగించేందుకు కేంద్రం ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటే, రాష్ట్రం వంతపాడుతోందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చవకబారు వాదనలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. జగదాంబ జంక్షన్‌లోని సిటు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విషయంలో గత వైసీపీ ప్రభుత్వ తీరు నచ్చక ప్రజలు ఘోరంగా ఓడించారన్న విషయం కూటమి నాయకులు గుర్తుంచుకోవాలని సూచించారు. 34 విభాగాలను ప్రైవేటీకరించడం ద్వారా కొత్త కాంట్రాక్టర్లకు బాధ్యతలు అప్పగిస్తారని, దీనితో స్థానికులు ఉద్యోగాలు కోల్పోతారని అన్నారు. గాజువాక ప్రాంతం ఎడారిగా మారిపోతుందని పేర్కొన్నారు. ఎమర్జన్సీని తలపించేలా దీక్షా శిబిరాలకు సైతం అనుమతులు ఇవ్వటం లేదని నర్సింగరావు ఆక్షేపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి అనేక రకాలుగా ప్రయత్నిస్తోందని, నిర్వాసితుల మధ్య అనైక్యత సృష్టిస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో ఆర్‌కేఎస్వీ కుమార్, యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పారా వాలీబాల్ వరల్డ్ కప్ పోటీలకు గణేష్, విజయ్‌కుమార్ ఎంపిక


సమావేశంలో మాట్లాడుతున్న బోడపాటి శివదత్

సీతంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 12 నుంచి 18 వరకు అమెరికాలో జరిగే పారా వాలీబాల్ వరల్డ్ కప్ పోటీలకు రాష్ట్రానికి చెందిన దివ్యాంగులు అన్న గణేష్, వేల్పుల విజయ్‌కుమార్‌లు ఎంపికైనట్లు పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (పీవీఏపీ) అధ్యక్షుడు బోడపాటి శివదత్ తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగ వైకల్యం శరీరానికే కాని, మనసుకు కాదని నిరూపిస్తూ సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో రాష్ట్రం తరఫున అద్భుతమైన ఆట తీరును అన్నం గణేష్, వేల్పుల విజయ్‌కుమార్‌లు ప్రదర్శించి ప్రపంచ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. గతంలో జరిగిన పారా వాలీబాల్ పోటీల్లో విజయనగరానికి చెందిన దివ్యాంగురాలు బి.వరలక్ష్మి గెలుపొందారని తెలిపారు. సమావేశంలో పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు జంపా నాగసంతోషరావు, దుండగి స్వరూప్, చుక్కా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు


ఆలయంలో కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

మహారాణిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో బుధవారం హుండీ కానుకలు లెక్కించారు. ఈ ఏడాది జూన్ 11 నుంచి బుధవారం వరకు హుండీలలో భక్తులు వేసిన నగదు, బంగారం, వెండి తదితర కానుకలు లెక్కించారు. మొత్తం రూ.46,53,301 నగదు, 84.900 గ్రాముల బంగారం, 795 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఈవో కె.శోభారాణి, జిల్లా దేవదాయశాఖ అధికారిణి అన్నపూర్ణ, ఎం.శ్రీధర్ పాల్గొన్నారు.

22 నుంచి శాప్ జోనల్ క్రీడా పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ నేతృత్వంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఈ నెల 22, 23 తేదీల్లో అమరావతి చాంపియన్‌షిప్ పేరుతో జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనుందని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అండర్-22 విభాగంలో అర్చరీ, అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్ పోటీలు, అండర్-19 విభాగంలో బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో విశాఖ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల జట్ల నుంచి పురుషులు, మహిళల విభాగాలకు సుమారు 1800 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. రైల్వే స్పోర్ట్సు ఎరీనాలో బాక్సింగ్, చంద్రంపాలెం స్కూల్‌లో బాస్కెట్‌బాల్ పోటీలు జరుగుతాయని, మిగిలిన క్రీడాంశాల పోటీలు కొమ్మాదిలోని ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు కాంప్లెక్సులో జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడా ప్రాంగణాలలో తాగునీరు, పారిశుధ్యం, సంచార మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని మధురవాడ జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. వైద్య సదుపాయం నిమిత్తం అంబులెన్స్, మందులు, వైద్యులను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. జోనల్ స్థాయిలో గెలుపొందినవారు ఈ నెల 24 నుంచి 26 వరకు తిరుపతిలో జరగనున్న తుది పోటీల్లో పాల్గొంటారని, వారికి బస్సు రవాణా సదుపాయం కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

క్రేన్ పైనుంచి జారిపడి ఉక్కు ఉద్యోగి మృతి


పైడికొండ మృతదేహం

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్‌షాప్ (ఎస్ఎంఎస్)-2 విభాగంలో క్రేన్‌పై నుంచి జారిపడి ఓ ఉద్యోగి మృతిచెందాడు. విభాగం ఉద్యోగులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.... వడ్లపూడి ఉక్కు నిర్వాసిత ప్రాంతానికి చెందిన కె.పైడికొండ (45) బుధవారం బి షిఫ్ట్‌కు హాజరయ్యాడు. రాత్రి 9.30 గంటల సమయంలో సుమారు క్రేన్‌పై సుమారు 60 అడుగుల ఎత్తు నుంచి జారి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలిండియా రైల్వే బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ వాల్తేరు డివిజన్ నిర్వహిస్తున్న అఖిల భారత పురుషుల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీ బుధవారం ప్రారంభమైంది. వాల్తేరు రైల్వే స్పోర్ట్సు ఎరీనాలో జరుతున్న ఈ పోటీలకు డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఈకార్వో అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నీలో పాల్గొంటున్న వివిధ జోన్ల క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇ.శాంతారాం, స్పోర్ట్సు ఆఫీసర్ ఎం.హరినాథ్, సహాయ క్రీడాధికారులు పాటిల్, సాహు, ప్రధాన కార్యదర్శి ఎస్.ఉష తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు మ్యాచ్‌ల్లో ఆతిథ్య తూర్పుకోస్తారైల్వే ఓటమి

తొలిరోజు జరిగిన లీగ్ మ్యాచ్‌లలో ఆతిథ్య తూర్పుకోస్తారైల్వేకు ఓటమి ఎదురైంది. వెస్ట్రన్ రైల్వేతో జరిగిన మ్యాచ్‌లో తొలి సెట్‌లో 35-30 స్కోరుతో పోటీ ఇచ్చిన తూ.కో రైల్వే, రెండో సెట్‌లో 35-19 స్కోరుతో చతికిలపడ్డారు. రెండో మ్యాచ్‌లో సౌత్ ఈస్ట్రన్ రైల్వేతో 2-1 స్కోరుతో ఓడింది. మిగిలిన లీగ్ మ్యాచ్‌ల ఫలితాలు: ఐసీఎఫ్ 2-0 స్కోరుతో ఎస్‌సీఆర్‌పై, సదరన్ రైల్వే 2-0 స్కోరుతో సౌత్ వెస్ట్రన్ రైల్వేపై, సౌత్ ఈస్ట్రన్ రైల్వే 2-1 స్కోరుతో సౌత్ వెస్ట్రన్ రైల్వేపై, సదరన్ రైల్వే 2-0 స్కోరుతో సౌత్ సెంట్రల్ రైల్వేపై, ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) 2-0 స్కోరుతో వెస్ట్రన్ రైల్వేపై, సదరన్ రైల్వే 2-0 స్కోరుతో వెస్ట్రన్ రైల్వేపై గెలుపొందాయి.

మేయర్ X కమిషనర్

... 5వ పేజీ తరువాయి

సమావేశాలకు కూటమి కార్పొరేటర్లు హాజరుకావద్దని ఆదేశించారని, అందువల్లే భీమిలి జోన్‌లో జరిగిన సమావేశానికి ఎవరూ హాజరవలేదని ప్రచారం జరుగుతోంది. ఈ విషయం కమిషనర్ దృష్టికి చేరడంతో మిగిలిన జోన్‌ల సమావేశాలను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు కొందరు కార్పొరేటర్లు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో మేయర్‌కు, కమిషనర్‌కు మధ్య పొరపొచ్చాలు వచ్చినట్టు చెబుతున్నారు. ఇదిలావుండగా నగరంలో తీవ్రస్థాయిలో దుమారం రేపుతున్న కోడివ్యర్థాల తరలింపు వ్యవహారం ఇద్దరి మధ్య దూరాన్ని మరింత పెంచినట్టు ప్రచారం జరుగుతోంది. కాంట్రాక్టులు దక్కించుకున్నవారు కోడి వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు కాకుండా చేపల చెరువులకు తరలిస్తున్నారు. అదేవిధంగా కొంతమంది అనధికార వ్యక్తులు, రౌడీషీటర్లను పెట్టుకుని దౌర్జన్యంగా దుకాణాల నుంచి కోడి వ్యర్థాలను సేకరించి చేపల చెరువులకు విక్రయించుకుంటున్నారు. ఇందుకు కొందరు కార్పొరేటర్లు, అధికారుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో కోడి వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్న వాహనాలను పట్టుకోవాలని అధికారులను మేయర్ ఆదేశించారు. గత 20 రోజుల్లో సుమారు 30 వాహనాలను అధికారులు పట్టుకున్నారు. వాటిలో మొదట పట్టుకున్న రెండు వాహనాలపై పీఎం పాలెం స్టేషన్‌లో కేసు నమోదు కాగా మిగిలిన వాహనాలను ముడసర్లోవ డంపింగ్ యార్డు వద్ద ఉంచారు. వాటిపై కూడా కేసులు నమోదు చేయాలని అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించారు. కానీ ఇంతవరకూ ఆ వాహనాలపై కేసు నమోదు చేయకపోవడం ఆయనకు ఆగ్రహం తెప్పించింది. తన మాటను పట్టించుకోవద్దంటూ అధికారులకు కమిషనర్ ఆదేశాలు ఇచ్చారని, అందుకే కేసులు పెట్టడం లేదని మేయర్ అనుమానం వ్యక్తంచేస్తున్నారు. కమిషనర్ తీరు ఇలాగే ఉంటే కౌన్సిల్‌లో తమకు ఇబ్బంది తప్పదని ఆందోళన చెందుతున్న మేయర్‌తోపాటు కూటమి కార్పొరేటర్లు నగరంలోని ప్రజా ప్రతినిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలని యోచిస్తున్నారు.

కిక్కిరిస్తున్న బస్సులు

... 5వ పేజీ తరువాయి

నమోదయ్యింది. వీటిలో జీరో టికెట్లే అత్యధికంగా నమోదయ్యాయని ఆర్టీసీ అధికారులు తెలియజేశారు.

మరో 40 వేలు మహిళా ప్రయాణికులు

వివిధ కళాశాలల్లో చదివే అమ్మాయిలు ప్రస్తుతం స్టూడెంట్ పాస్‌లతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం అన్నిరకాల పాస్‌లు కలిపి 1.5 లక్షలు జారీ చేసింది. అందులో స్టూడెంట్ రాయితీ పాస్‌లు 90 వేలు ఉన్నాయి. నగరం, పరిసరాల్లో డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, ఇతర కోర్సులు చదివే విద్యార్థినుల్లో 40 వేల మంది త్రైమాసిక, అర్థ సంవత్సర, సంవత్సర కాలపరిమితితో ఆర్టీసీ రాయితీ పాస్‌లు తీసుకున్నారు. మూడు నెలలకు సంబంధించిన పాస్‌ల కాలపరిమితి ముగిసిన అమ్మాయిలు స్టూడెంట్ రాయితీ పాస్‌లు తీసుకోకుండా స్త్రీశక్తి పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఆరు నెలలు, సంవత్సర పాస్‌లు తీసుకున్న అమ్మాయిలు కూడా ఇదే పద్ధతి అనుసరిస్తారు. దీనివల్ల దశల వారీగా మరో 40 వేల మంది స్త్రీశక్తి పథకంలో చేరనున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

జీవీఎంసీలో ఈట్ రైట్ క్యాంపైన్

... 5వ పేజీ తరువాయి

పరిధిలో రెండు ఎస్‌హెచ్‌ఈ టీమ్స్ చొప్పున మొత్తం 16 టీమ్‌లను ఈట్‌రైట్ క్యాంపైన్ కోసం ఏర్పాటు చేశామని జీవీఎంసీ కమిషనర్ వివరించారు. ఈ టీమ్‌లు హోటల్స్, రెస్టారెంట్లు, బేకరీలు, వీధి ఆహార విక్రయ కేంద్రాల్లో పదార్థాల నాణ్యత, పరిశుభ్రతను పరిశీలిస్తాయని, నిబంధనలు పాటించని, నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తున్న వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తాయన్నారు. ఇప్పటివరకూ 8 జోన్లలో 76 చోట్ల ఆహార తనిఖీలు చేపట్టాయన్నారు. 71 హోటళ్లు, రెస్టారెంట్లకు, ఆహార విక్రయ కేంద్రాలకు నోటీసులు ఇచ్చి రూ.68,600 అపరాధ రుసుము వసూలు చేశాయన్నారు. ఒకటో జోన్‌లో 8 చోట్ల తనిఖీలు చేపట్టి మూడింటి నుంచి రూ.21 వేలు, రెండో జోన్‌లో 11 చోట్ల తనిఖీలు నిర్వహించి 10 దుకాణాల నుంచి రూ.10 వేలు, మూడో జోన్‌లో పదకొండుచోట్ల తనిఖీలు చేయగా ఐదుగురి నుంచి రూ.21 వేలు, 4వ జోన్‌లో పదిచోట్ల తనిఖీలు చేపట్టి రూ.11 వేలు, ఐదో జోన్‌లో పదకొండుచోట్ల తనిఖీలు చేసి ముగ్గురి నుంచి రూ.4 వేలు, 6వ జోన్‌లో ఏడు చోట్ల తనిఖీల్లో భాగంగా ఆరుగురి నుంచి రూ.7,800, ఏడో జోన్‌లో ఆరు చోట్ల జరిగిన తనిఖీల్లో ముగ్గురి నుంచి రూ.1,300, 8వ జోన్‌లో పన్నెండుచోట్ల చేపట్టిన తనిఖీల్లో పది దుకాణాల నుంచి రూ.11 వేలు అపరాధ రుసుం కింద వసూలు చేసినట్టు చెప్పారు. ఈ టీమ్‌లు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. ప్రజల ఆహార భద్రతతో పాటు, ప్లాస్టిక్ నియంత్రణ దిశగా వ్యాపారుల్లో మార్పు తీసుకురావడమే వీటి లక్ష్యమన్నారు. తద్వారా ప్లాస్టిక్ రహిత, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ కృషిచేస్తుందని కమిషనర్ పేర్కొన్నారు. నగరంలో ఆహార విక్రయదారులు పరిశుభ్రతతో పాటు నాణ్యతపై దృష్టిసారించాలన్నారు. ఆహార ఉత్పత్తుల్లో కల్తీకి పాల్పడినా, నిషేధిత ప్లాస్టిక్ వినియోగించినా హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు ఇతర ఆహార విక్రయ కేంద్రాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వన్‌టౌన్‌లో ఒరిగిన భారీ భవనం

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదు చేయడంతో బుధవారం రాత్రి జీవీఎంసీ అధికారులు, పోలీసులు, దక్షిణ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌తో అక్కడకు చేరుకున్నారు. పది కుటుంబాల వారిని తక్షణమే ఖాళీ చేయాలని ఆదేశించారు. బిల్డింగ్ యజమానులకు జీవీఎంసీ అధికారులు నోటీసులు జారీచేశారు. పక్కనే ఉన్న భరణి ఫంక్షన్ హాల్ కూడా కొద్దిగా పక్కకు ఒరిగినట్టు అధికారులు గుర్తించారు. కశిరెడ్డి బిల్డింగ్ యజమాని జీ+2 అనుమతులు తీసుకొని జీ+5 నిర్మాణం చేపట్టారు. ధరణి ఫంక్షన్ హాల్ కూడా జీ+2 అనుమతులు తీసుకొని జీ+3 నిర్మాణం చేపట్టినట్టు అధికారులు గుర్తించారు.

1579 మంది అనర్హులు

... 5వ పేజీ తరువాయి

మండలాల్లో 401 మంది ఉన్నట్టు గుర్తించారు. అయితే రీవెరిఫికేషన్‌లో 125 మంది 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్నట్టు నిర్ధారించారు. మరో 182 మంది 60 ఏళ్ల దాటినవారు కావడంతో వృద్ధాప్య పింఛన్లు తీసుకునేందుకు అర్హులుగా తేల్చారు. ఈ 307 మందికి త్వరలో సొమ్ము బట్వాడా చేస్తారు. కాగా దివ్యాంగ పింఛన్లు నిలిపివేతకు సంబంధించి నోటీసులు జారీచేస్తున్నారు. నోటీస్ అందుకున్న నెల రోజులలో జోనల్ కమిషనర్/ఎంపీడీవోకు అప్పీల్ చేసుకునే అవకాశం ఇచ్చారు. అయితే కొందరు పింఛన్‌దారులు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. గతంలో తమకు 40 శాతం అంగవైకల్యం ఉన్నట్టు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారని, ఇప్పుడు అవే పత్రాలు తప్పని ఎలా చెబుతారని నిలదీస్తున్నారు.

ఇంకెన్నాళ్లు!

ఎనిమిదేళ్లుగా పాఠశాలలోనే వసతిగృహ నిర్వహణ

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న స్కూల్, హాస్టల్ విద్యార్థులు



పెందుర్తిలో పాఠశాలలోనే కొనసాగుతున్న బీసీ బాలుర వసతిగృహం

సదుపాయాల లేమితో విలవిల్లాడుతున్నామని పలువురు విద్యార్థుల ఆవేదన

పట్టించుకోని సాంఘిక సంక్షేమశాఖ అధికారులు

పెందుర్తి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పెందుర్తిలోని బీసీ బాలుర వసతిగృహంలో సమస్యలు తిష్ట వేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల ఎనిమిదేళ్లుగా విద్యార్థులు 'వసతి' వేదనతో విలవిల్లాడుతున్నారు. వసతిగృహం లేకపోవడంతో పెందుర్తిలోని పీఎంశ్రీ పాఠశాలలో ఎనిమిదేళ్ల కిందట తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పాఠశాల అదనపు తరగతుల గదుల్లోనే బీసీ విద్యార్థులు వసతి పొందుతున్నారు. పరిమితికి మించిన విద్యార్థుల చేరికతో ఇది సంక్షేమ వసతిగృహంగా మారింది. విద్యార్థుల అవసరాలకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలు లేకపోవడంతో వారు నానాపాట్లు పడుతున్నారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయటే కాలకృత్యాలను తీర్చుకుంటున్నారని పరిసర ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఎనిమిదేళ్లుగా పాఠశాల రెండతస్థుల అదనపు భవనంలో బీసీ హాస్టల్ ఏర్పాటుతో తాత్కాలికంగా వచ్చిన విద్యార్థులు శాశ్వతంగా ఉండడంతో పీఎంశ్రీ పాఠశాల విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా తరగతి గదులు చాలడం లేదు. దాదాపు 1,300 మంది విద్యార్థులతో జిల్లాలోనే రెండో అతిపెద్ద ఉన్నత పాఠశాలగా ఉన్న ఇది ఇటీవల పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికైంది. పాఠశాలకు చెందిన భవనంలోనే వసతిగృహ నిర్వహణతో పాటు తరగతులు జరుగుతుండడం, ల్యాబ్‌లు, ఇతర సౌకర్యాల ఏర్పాటుకు గదులు చాలడం లేదు. అంతేకాక పాఠశాలకు చెందిన స్నానపు గదులు, మరుగుదొడ్లనే వసతిగృహ విద్యార్థులు కూడా వినియోగిస్తున్నారు. వసతిగృహ భవన నిర్వహణ భారం కూడా పాఠశాలపైనే పడుతుండడంతో విద్యుత్ బిల్లు చెల్లింపునకే ఇబ్బందులు పడుతున్నారు.

వసతిగృహంలో పరిమితికి మించి విద్యార్థులు?

పాఠశాల ప్రాంగణంలో వున్న బీసీ వసతిగృహంలో పరిమితికి మించి విద్యార్థులు చేరారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా వసతి గృహ సంక్షేమ అధికారుల మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చి 120 సీట్లకు గాను అధిక సంఖ్యలో విద్యార్థులకు ప్రవేశం కల్పించారన్న విమర్శలున్నాయి. హాస్టల్‌లో పరిమితికి మించి విద్యార్థులను చేర్చుకోవాలంటే స్థానిక అడ్వైజరీ కమిటీ చైర్మన్, స్థానిక శాసనసభ్యుడి అనుమతి ఉండాలి. కాగా పాఠశాలలో ఉన్న ఒక్క తాగునీటి బోరు వసతి, పాఠశాల విద్యార్థుల అవసరాలుకు సరిపోవడం లేదని పలువురు విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు. మధ్యాహ్న భోజన పథకం ఇతర అవసరాలకు నీటి సమస్య ఉత్పన్నమవుతోంది. పూర్తి స్థాయిలో సదుపాయాలు లేక వసతిగృహ విద్యార్థులు నానాపాట్లు పడుతున్నారు. పాఠశాలలోనే వసతిగృహం నడుస్తున్నందున దీనిని ప్రత్యేక హాస్టల్‌గా పరిగణింపకపోవడం వల్ల భద్రత కొరవడింది. దీంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ కొరవడిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. పోస్ట్ మెట్రిక్, ప్రీమెట్రిక్ వివాదం ఏర్పడడంతో పెందుర్తిలో బీసీ వసతిగృహం లేకుండా పోవడంతో పీఎంశ్రీ పాఠశాలలోనే వసతి గృహ నిర్వహణ జరుగుతుంది. వసతిగృహ విద్యార్థులు ఇక్కడ నుంచి ఖాళీ చేయాలని పాఠశాల నుంచి పలుమార్లు నోటీసులు ఇచ్చినా సాంఘిక సంక్షేమశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయ సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బీసీ వసతిగృహ విద్యార్థుల కోసం శాశ్వత భవన నిర్మాణాన్ని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



ఆరుబయట స్నానాలు చేస్తున్న వసతిగృహం విద్యార్థులు



రక్తదాన శిబిరంలో పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు

రక్తదానం ప్రాణ దానంతో సమానం

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

అనగంపూడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణ దానంతో సమానమని, అందువల్ల అందరూ అపోహలను వీడి రక్తదానం చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కోరారు. డీఆర్‌ఎస్ యువసేన ఆధ్వర్యంలో ఫార్మాసిటీ పునరావాస కాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డీఆర్‌ఎస్ యువసేన చేస్తున్న సేవలు ప్రశంసనీయమైనవన్నారు. డీఆర్‌ఎస్ యువసేన ద్వారా జనసేన నేత దుల్ల రామునాయుడు చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం పలువురు యువకులు స్వచ్ఛందగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీరాము నాయుడు, నాయకులు కర్రి దేవేంద్ర, దుల్ల వరహాలు, సంజయ్, కొలిపాక అప్పారావు, గోపి, చెల్లారావు, గౌరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గాజువాక, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్టీల్ సిటీ ఐటీఐలో మిగులు సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు 27వ తేదీన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు, 29న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు ఐటీఐను సంప్రందించాలని కోరారు.

'యాజమాన్యం వల్లే ఉక్కు ఉత్పత్తి తగ్గింది'

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో ఉక్కు ఉత్పత్తి తగ్గడానికి యాజమాన్యానిదే పూర్తి బాధ్యత అని సీఐటీయూ ప్లాంట్ అధ్యక్షుడు వైటీ దాసు అన్నారు. యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంటును పూర్తి స్థాయిలో ఉత్పత్తి సాధిస్తామని చెప్పిన ప్రభుత్వం, యాజమాన్యం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ప్లాంటులో ఈవోఐ పేరులో పలు కీలక విభాగాలను ప్రైవేటీకరించేందుకు కుట్ర జరుగుతుందన్నారు. ఉక్కు కర్మాగారంలో ప్లాంట్‌లో అనుభవజ్ఞులైన కార్మికులను తొలగించి ఇతర రాష్ట్రాలకు చెందిన అనుభవం లేని వారిని నియమించుకుంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఆయా విభాగాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు పందిరి రాట

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తుంగ్లాం కాలనీలోని విజయరాఘవస్వామి ఆలయ ప్రాంగణంలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వినాయక చవితి ఉత్సవాలకు పందిరి రాట వేశారు. ప్రధాన అర్చకులు దేవీశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి పందిరి రాటను ప్రతిష్ఠించారు. కాలనీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ పునరావాస కాలనీలో బోరు ప్రారంభం

అగనంపూడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు అమలుతో పాటు అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దేవేంద్ర అన్నారు. ఫార్మాసిటీ పునరావాస కాలనీలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరింగ్‌ను బుధవారం కూటమి శ్రేణులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు డొక్కా రమేశ్, నూకరాజు, అర్జున్, జి.పైడిరాజు, శివాజీ, కార్తీక్, శ్రీనివాసరావు, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ పార్కులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర



చీపుర్లతో పార్కును శుభ్రం చేస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమల నగర్‌లోని మహాత్మాగాంధీ పార్కులో బుధవారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యుడు జి.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పార్కులో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను, గడ్డి, గుబురుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించామన్నారు. అలాగే రహదారులను చీపుర్లతో శుభ్రపరిచామని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కాలనీల్లో నీటి గుంటలను శుభ్రంగా తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది, కాలనీవాసులు పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి, మహేశ్వరరావు, వెంకటరావు, కామరాజు, సురేంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.



మోనాలిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్, తదితరులు

అథ్లెటిక్స్‌లో విజ్ఞాన్ విద్యార్థిని మోనాలికి సిల్వర్ మెడల్

అగనంపూడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చీరాలలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం విద్యార్థిని కె.మోనాలి విశేష ప్రతిభ కనబరిచి సిల్వర్ మోడల్‌ను సాధించింది. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోనాలిని ప్రిన్సిపాల్ జె.సుధాకర్ అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. భవిష్యత్తులో మోనాలి మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదన రావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం నిరసన

గాజువాక, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అదానీ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేస్తూ బుధవారం 76వ వార్డులో సీపీఎం నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం గాజు వాక జోన్ కమిటీ సభ్యుడు ఎం.రాంబాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల విద్యుత్ బిల్లుల భారం మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలందరూ వీటిని తిరస్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు యోచనను విరమించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యుత్ చార్జీలను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు గొలగాని అప్పారావు, లక్ష్మి, రాము, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు విశేషనీయం

జయంతి కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న లక్కరాజు రామారావు

గాజువాక, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, దేశ ప్రగతి కోసం మాజీ ప్రధాన మంత్రి దివంగత రాజీవ్ గాంధీ చేసిన సేవలు విశేషనీయమైనవని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్కరాజు రామారావు అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం పాత గాజువాకలోని ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామారావు మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ రంగాన్ని రాజీవ్‌గాంధీ బలోపేతం చేశారని, యువతకు ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గవర వెంకట రమణారావు, జెర్రి పోతుల ముత్యాలు, ఉరుకూటి అచ్చిబాబు, డి.అప్పలనాయుడు, చట్టి సింహాచలం, మురళీశ్వరరావు, రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: గాజువాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నడుపూరు రాజీవ్ కూడలిలో దివంగత రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి పీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు లక్కరాజు రామారావు, యరబాల భూలోక, ఎంఎస్ వర్మ, కట్టా అప్పారావు, కె.చిన్నారావు, హరిబాబు, సాగి సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.

హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో డయాగ్నస్టిక్ ల్యాబ్ ప్రారంభం

ఐవోసీఎల్ సీఎస్ఆర్ నిధులు రూ.8.93 కోట్లతో ఏర్పాటు



ల్యాబ్‌ను ప్రారంభించిన ఐవోసీఎల్ డైరెక్టర్ రష్మి గోవిల్

అగనంపూడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో కీలకమైన డయాగ్నస్టిక్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం ఈ ల్యాబ్‌ను ఐవోసీఎల్ హెచ్‌ఆర్ విభాగం డైరెక్టర్ రష్మి గోవిల్, ఆస్పత్రి డైరెక్టర్ ఉమేశ్ మహంతిశెట్టి కలిసి ప్రారంభించారు. అనంతరం రష్మి గోవిల్ మాట్లాడుతూ హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ఇక్కడ తమ సంస్థ రూ.8.93 కోటుట్ల వెచ్చించి డయాగ్నస్టిక్ పరికరాలను సమకూర్చి ల్యాబ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దేశంలో క్యాన్సర్ రోగులు విపరీతంగా పెరుగుతున్నారని, అందువల్ల అందరూ ముందస్తు జాగ్రత్రలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐవోసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బిభూతి రంజన్ ప్రదాన, డైరెక్టర్ అండ్ స్టేట్ హెడ్ పియూష్ మిట్టల్, తదితరులు పాల్గొన్నారు.

90వ వార్డులో డ్రైనేజీల అభివృద్ధికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ, తదితర నాయకులు

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు గవరవీధిలో రూ.46.85 లక్షల కార్పొరేషన్ నిధులతో డ్రైనేజీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్టు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేశామని అన్నారు. ఈ ప్రాంతంలో ఏళ్ల నుంచి శిథిలస్థితిలో ఉన్న కాలువలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

వేపగుంట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): లంకానగర్, సింహాద్రినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్తు ఫీడర్లపై చెట్ల కొమ్మల తొలగింపు పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్ 3 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు.

'ఒక్కసారి ఆలోచిద్దాం'

రికార్డింగ్ డ్యాన్స్‌ల నిర్మూలనకు బ్యానర్లతో అవగాహన

పెందుర్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రికార్డింగ్ డ్యాన్స్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'ఒక్కసారి ఆలోచిద్దాం మంచి సంస్కృతిని నిర్మిద్దాం' అనే సందేశంతో ముఖ్య కూడళ్లలో పెందుర్తి పోలీసులు బ్యానర్లు ఏర్పాటు చేశారు. సీఐ కేవీ.సతీశ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పెందుర్తి, వేపగుంట, నరవ ప్రాంతాల్లో ఈ బ్యానర్లు ఏర్పాటు చేశారు. మహిళలను కించపరిచే విధమైన ప్రవర్తనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. మహిళలను గౌరవించడం మన సంస్కృతి అని నినాదిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.



పెందుర్తిలో బ్యానర్ ఏర్పాటు చేసిన పోలీసులు

గెడ్డలపై నిర్లక్ష్యం..లోతట్టు ప్రాంతాలు జలమయం



కొత్తపాలెం శివారులో నిలిచిపోయిన వర్షపు నీరు

గోపాలపట్నం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం సహజంగా ఏర్పడిన గెడ్డలను ఇప్పుడున్న నాయకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో కొన్ని ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ముఖ్యంగా 89వ వార్డు కొత్తపాలెం శివారు ప్రాంతం మాత్రం పూర్తిగా మునిగిపోతోంది. గోపాలపట్నం కొండవాలు ప్రాంతం, వేపగుంట పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన నీరు కొత్తపాలెం నుంచి షిలానగర్ మీదుగా సముద్రంలో కలుస్తోంది. అయితే మూడు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో ప్రజలు నివాసం ఉండేవారు కాదు. కానీ ఇప్పుడు అభివృద్ధి జరిగి ఈ ప్రాంతంలో జనవాసం పెరిగిపోయింది. అయితే గెడ్డలను ఆధునీకరణ చయకపోవడం, గెడ్డల్లో పూడికలు తీయకపోవడం, ఆక్రమణలతో గెడ్డలు కుంచించుకుపోవడం వల్ల చిన్న వర్షానికే గెడ్డలు నిండి స్థానిక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకోండి

పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదిశేషు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా పరిశ్రమలను ఏర్పాటు స్థాపించదలచిన వారికి ప్రభుత్వం అనేక ప్రోత్సహకాలను ఇస్తోందని, వాటిని వినియోగించుకోవాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు అన్నారు. ఆగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలపై అవగాహన కార్యక్రమాన్ని ఎంవీపీ కాలనీలోని భద్రం సామాజిక భవనంలో బుధవారం నిర్వహించారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్, టీమ్ ఇండస్ట్రీస్ కన్సల్టెన్సీ, సర్వీసెస్, ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీమ్ ఇండస్ట్రీస్ కన్సల్టెన్సీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ డి.మధుసూదనరావు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్‌పర్సన్ గీతా శ్రీకాంత్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డెప్యూటీ జనరల్ మేనేజర్ ఏవీ రమణమూర్తి తదితరులు మాట్లాడుతూ.. కొత్తగా వ్యాపారాలు ప్రారంభించదలచినవారు, ఇప్పటికే పరిశ్రమలు నెలకొల్పిన వారికి మార్గదర్శనం కల్పించడంతో పాటు, ప్రభుత్వ ఎంఎస్ఎంఇ పథకాలు, రుణాలు, రాయితీలపై అవగాహన కల్పించారు.

అర్హులకు వెంటనే టిడ్కో ఇళ్లను ఇవ్వాలి

సీపీఐ నాయకుల డిమాండ్

మల్కాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అచ్చినాయుడు తోట, ములగాడ గ్రామంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను సీపీఐ బృందం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. అయితే మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందని, అవి పూర్తయిన తరువాత అర్హులకు ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల విషయంలో మోసం చేసిందని ఇప్పుడు ఈ కూటమి ప్రభుత్వ ఆలస్యం చేయకుండా ఇళ్లను మంజూరు చేయాలన్నారు. టిడ్కో ఇళ్లకు అర్హులుగా గుర్తించిన వారికి ప్రభుత్వం ఇవ్వకపోతే సీపీఐ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయులతో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెందుర్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త విన్నకోట రాము ఆధ్వర్యంలో బుధవారం చినముషిడివాడలో నిర్వహించారు. ఈ సదర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశ సాంకేతిక అభివృద్ధికి రాజీవ్ చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభల వాల్ పోస్టర్ల విష్కరణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

వేపగుంట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 23, 24, 25 తేదీల్లో ఒంగోలులో జరిగే మహాసభలను విజవంతం చేయాలని సీపీఐ నాయకులు బుధవారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సంరద్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం, కేంద్రాల్లో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాలు దేశ సంపదను ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయానలి చూస్తున్నాయని అన్నారు. అదేవిధంగా ఓటు, మత రాజకీయాలను ప్రోత్సహించి రాజ్యాంగ విలువలను మంటగలిపేలా వ్యవహరిస్తోందని అన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని నగర నాయకులు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు పిలుపునిచ్చారు.

దోమల నివారణపై అవగాహన

మల్కాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురంలో ఏడు వార్డుల(40, 58 నుంచి 63) మలేరియా విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ ర్యాలీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ మాట్లాడుతూ ఆడ ఎనాఫిలిస్ దోమల వల్ల మనుషులకు మలేరియా వ్యాపిస్తుందని అన్నారు. ఈ విషయాన్ని సర్ రోనాల్డ్ రాస్ 1897 ఆగస్టు 20న గుర్తించారని తెలిపారు. ఈ సందర్భంగా ఏటా ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా వంటి వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు మలేరియా సిబ్బంది ప్రతిరోజు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. అందరూ ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే తప్పకుండా పాటించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దోమల నివారణకు సంబంధించి సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం).

● **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం).

● **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 47, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 26, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 22, బీరకాయలు 38, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 20, క్యారెట్ 42, దొండకాయలు 26, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 58, బద్దచిక్కుడు 50, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 72, కీరదోస 34, క్యాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడుచిక్కుడు 70, గోరుచిక్కుడు 34, కూరపెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	103
లైవ్ ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

ఐటీఐలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగులు సీట్లకు మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. ఈ నెల 26న సాయంత్రం 5 గంటల్లోగా ఐటీఐ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమీపంలోని ప్రభుత్వ/ ప్రైవేటు ఐటీఐకు హాజరై ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకోవాలి. ప్రభుత్వ ఐటీఐల్లో సీట్లకు 29 న, ప్రైవేటు ఐటీఐలకు 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని శ్రీకాంత్ తెలియజేశారు.

బ్రహ్మపూర్ రైలు పలాస వరకే

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ-బ్రహ్మపూర్ మధ్య నడుస్తున్న పాసింజర్ రైళ్ల గమ్యాలను కుదించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 24 వరకు విశాఖ-బ్రహ్మపూర్ పలాస వరకు, బ్రహ్మపూర్-విశాఖ విశాఖకు రాకపోకలు సాగిస్తాయన్నారు. పలాస-బ్రహ్మపూర్ మధ్య రాకపోకలను రద్దుచేశామన్నారు.

ఐదువేల మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

» కాలుష్య నియంత్రణమండలి ఈఈ ముకుందరావు

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా నగరంలో ఐదువేల మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేయనున్నట్టు కాలుష్య నియంత్రణ మండలి ఈఈ పి.ముకుందరావు తెలిపారు. పర్యావరణ హితంగా ఉండేలా మట్టితోనే విగ్రహాలు తయారుచేస్తున్నామని, నగరంలో రైతుబజార్లు, ప్రధాన కూడళ్లు, మాధవధార పీసీబీ కార్యాలయం వద్ద విగ్రహాలు పంపిణీచేస్తామన్నారు. నగరంలో పెద్దఎత్తున ఏర్పాటుచేసే మండపాల్లో మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని కోరారు. సహజమైన రంగులతో విగ్రహాలు తయారుచేసుకోవాలని హితవు పలికారు. గతంతో పోల్చితే మట్టి ప్రతిమలపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. ఈ మేరకు కళాజాతలు, ర్యాలీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వినాయక చవితి పండుగలో పిల్లల భాగస్వామ్యం ఎక్కువగా ఉంటుందని పేర్కొంటూ పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తామన్నారు. నగరంలో వినాయకచవితి ఉత్సవాలలో మట్టి వినాయక విగ్రహాలతో పూజలు చేయాలని కలెక్టర్ సూచించారని ఈఈ పేర్కొన్నారు.

ఆకట్టుకున్న స్టార్టప్ స్టాళ్లు

» రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ప్రారంభమైన ప్రదర్శన

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సిరిపురం జంక్షన్‌లోని 'ది డెక్' లో బుధవారం ప్రారంభించిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఏర్పాటు చేసిన స్టార్టప్ స్టాళ్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. అంతార్ ఐటీ స్టార్టప్ ఫెన్సింగ్‌పై తయారు చేసిన ప్రాజెక్ట్ ఆసక్తికరంగా ఉంది. ఏదైనా భవనానికి ఫెన్సింగ్ ఉంటే దానికి వీరు అభివృద్ధి చేసిన టెక్నాలజీ ఉపయోగించుకుంటే.. కంచె దాటి లోపలకు ఎవరు వచ్చినా వెంటనే సైరన్ మోగించి అలెర్ట్ చేస్తుంది. పెద్ద భవనాలు, భూములకు దీని ఉపయోగం ఎక్కువని నిర్వాహకులు పేర్కొన్నారు. దీనిని మొబైల్‌కు అనుసంధానం చేసుకుంటే.. ఫెన్సింగ్ ధ్వంసం చేసినా తెలుస్తుందని, ఆఘటన ఎక్కడ జరిగిందీ ఫోన్‌లో చూసుకోవచ్చునని వివరించారు. దీనికి రెండు పరికరాలతో పాటు కంచెతో సమానంగా వైరింగ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.



నీటిలో మునిగిపోతున్న వారిని రక్షించే పరికరం

వాటర్ ట్యాంక్‌లకూ ఓ స్టార్టప్

పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లలో వాటర్ ట్యాంకులను నీటితో నింపడానికి బోర్లు వేసుకునేటప్పుడు ఏది ఎప్పుడు నిండిందో చూసుకొని వెంటనే మోటార్ ఆపు చేయాల్సి ఉంటుంది. ట్యాంక్ నిండగానే ఆటోమేటిక్‌గా బోరు మోటారు ఆగిపోయే టెక్నాలజీ ప్రస్తుతం అందుబాటులో ఉంది. అయితే ఫ్లోస్టాట్ అనే స్టార్టప్ ఎక్కువ ట్యాంకులు కలిగిన అపార్ట్‌మెంట్ల కోసం కొత్త టెక్నాలజీ అందుబాటులోకి తీసుకువచ్చింది. పదుల సంఖ్యలో ఉన్న ట్యాంకులలో ఏది ఎప్పుడు నిండిపోతే ఆ వెంటనే ఆ సమాచారం యజమానులకు అందించి అలెర్ట్ చేస్తుంది. ఆటోమేటిక్ కటాఫ్ కూడా ఉంటుంది. అదే విధంగా ఏ ట్యాంక్ ఎంత సేపటిలో నిండుతుంది? ఒక వేళ నిండకపోతే కారణం ఏమిటి? ఫ్లోరైడ్ చేరి మోటారు పనితనం ఏమైనా తగ్గిందా? వంటి సమాచారం కూడా ఈ టెక్నాలజీ అందిస్తుందని స్టార్టప్ ఫౌండర్ అనిక్ పంజా తెలిపారు. సముద్రంలో దిగి మునిగిపోతున్న వారిని రక్షించేందుకు సైఫ్ సీస్ సంస్థ తయారు చేసిన రిమోట్ పరికరాన్ని ఇక్కడ ప్రదర్శించారు.



ఫెన్సింగ్ రక్షణకు ఉపకరించే డిటెక్టివ్ సిస్టమ్

మాతా, శిశు మరణాల నియంత్రణపై దృష్టి సారించాలి

» మరణాలకు ఆరోగ్య కేంద్రం వైద్యులదే బాధ్యత

» కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, హాజరైన అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందు బాటులోకి వచ్చినా, ఇప్పటికీ మాతా, శిశు మరణాలు సంభవించడం దురదృష్టక రమని, వీటి నియంత్రణపై వైద్యులు దృష్టిసారించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు జిల్లాలో సంభవించిన మాతా, శిశు మరణాలపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మాతా, శిశు మరణాల సర్వేలెన్స్, రెస్పాన్స్ కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఈ కాలంలో మూడు మాతృ మరణాలు సంభవించాయన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మాతృమరణాలు ఇకముందు సంభవించకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత ఆరోగ్యశాఖ కేంద్రం అధికారులదేనన్నారు. ఏఎన్ఎం సమ యానికి గర్భిణికి అవసరమైన సేవలను అందించాల న్నారు. ఇకపై మాతృమర ణాలు సంభవిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైరిస్క్ గర్భిణులను కేజీహెచ్, వీజీహెచ్‌కు రిఫర్ చేయాలన్నారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఆడ పిల్లలకు కౌమార దశ నుంచే జరిగే మార్పులపై అవగాహన కల్పించాలన్నారు. హైరిస్క్ గర్భిణుల బర్త్‌ప్లానింగ్ సక్రమంగా చేయాలన్నారు. వారికి ఆరోగ్యస్థితిని వివరించాలన్నారు. అలాంటి వారిని ముందుగానే గుర్తించి సమయానికి టీకాలు, పోషకాహారం అందించేలా చూడాలని డీఎంహెచ్‌వో సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య విధాన పరిషత్ సమన్వయ అధికారి డాక్టర్ శంకరప్రసాద్, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ అప్పారావు, వీజీహెచ్ సూపరింటెం డెంట్ డాక్టర్ ఉషాప్రసాద్, కేజీహెచ్ డిప్యూటీ సూపరిం టెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ లూసీ, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

నేడు ఏపీఎల్ ఎలిమినేటర్, క్వాలిఫయిర్ మ్యాచ్‌లు

విశాఖపట్నం-స్పోర్ట్స్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-4 మ్యాచ్‌లు ప్లే ఆఫ్ దశకు చేరాయి. ఇప్పటివరకూ జరిగిన లీగ్ మ్యాచ్‌లలో అమరావతి రాయల్స్ అత్యధికంగా 10 పాయింట్లు సాధించగా, తుంగభద్ర వారియర్స్ 8, విజయవాడ సన్ షైనర్స్ 7, భీమవరం బుల్స్ 6 పాయింట్లతో ఎలిమినేటర్, క్వాలిఫయిర్ అర్హత సాధించాయి. గురువారం మధ్యాహ్నం 1.30 గంటలకు జరగనున్న ఎలిమినేటర్ మ్యాచ్‌లో విజయవాడ సన్ షైనర్స్-భీమవరం బుల్స్, సాయంత్రం 6.30 గంటలకు జరగనున్న క్వాలిఫయిర్-1 మ్యాచ్‌లో అమరావతి రాయల్స్-తుంగభద్ర వారియర్స్ తలపడనున్నాయి.

లీగ్ మ్యాచ్‌లలో టాప్ స్కోరర్ అశ్విన్ హెబ్బర్

ఏపీఎల్-4లో ఇప్పటివరకూ జరిగిన లీగ్ మ్యాచ్‌లలో అత్యధిక వ్యక్తిగత స్కోరర్‌గా విజయవాడ సన్ షైనర్స్ కెప్టెన్ అశ్విన్ హెబ్బర్ (ఆరు ఇన్నింగ్స్‌లో 309 పరుగులు), అత్యధిక వికెట్లు (11) తీసిన బౌలర్‌గా పీవీఎస్ఎన్ రాజు (తుంగభద్ర వారియర్స్) నిలిచారని ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు పేర్కొన్నారు. బుధవారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రికెటర్లకు మంచి భవిష్యత్తు అందించాలని ఉద్దేశంతో ఐపీఎల్ తరహాలో నిర్వహిస్తున్న ఏపీఎల్-4 విజయవంతంగా సాగుతోందని ఆనందం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో ప్లే ఆఫ్‌కు చేరిన అమరావతి రాయల్స్, తుంగభద్ర వారియర్స్, భీమవరం బుల్స్, విజయవాడ సన్ షైనర్స్ జట్ల సారథులు పాల్గొన్నారు.

పోర్టును సందర్శించిన రష్యన్ బృందం



విశాఖ పోర్టులో రష్యన్ బృందంలోని సభ్యులు

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, విద్య, ప్రైవేటు పరిశ్రమల ప్రతినిధులతో కూడిన 14 మంది రష్యన్ బృందం బుధవారం పోర్టును సందర్శించింది. బృందానికి పోర్టు అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. విద్య, నైపుణ్య శిక్షణ, పారిశ్రామిక రంగంలో భాగస్వామ్యం, అవకాశాలను పరిశీలించడం, భారతీయ నైపుణ్య కార్మికులను రష్యా పంపే అవకాశాలు కల్పించడం బృందం పర్యటనలో ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భంగా పోర్టు అధికారులు అక్కడి మౌలిక వసతులు, సరకు నిర్వహణ సామర్థ్యం ఆధునికీకరణ, యాంత్రీకరణ చర్యలు, కవర్డ్ స్టోరేజీ సదుపాయాలు వివరించారు.

వివాహితపై అత్యాచారం కేసులో ఇద్దరి అరెస్టు

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వివాహితపై అత్యాచారం కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన వారం రోజుల క్రితం జరగ్గా నిందితుల్ని అరెస్టు చేసిన తర్వాత పోలీసులు వివరాలు తెలిపారు. ఈ కేసులో మండలంలోని ఓ గ్రామానికి చెందిన కొయ్య రామకృష్ణ, సహకరించిన ఒనుము శ్రీనును అరెస్టు చేశారు. గ్రామంలో వివాహితపై (30) కన్ను వేసిన రామకృష్ణ ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి అత్యాచారం చేశాడని పోలీసులు చెప్పారు. ఈ వ్యవహారంలో శ్రీను కీలకం కావడంతో అతడ్ని కూడా అరెస్టు చేశారు. సంఘటన జరిగిన వెంటనే బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి భీమిలి సీఐ తిరుమలరావుకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం నిందితులకు కూడా తెలియలేదు. నిందితుల్ని అదుపులోకి తీసుకుని వివరాలు రాబట్టారు. బుధవారం రాత్రి అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. బాధితురాలిని వైద్య పరీక్షలకు పంపి, వివరాలు తీసుకుని, కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

రౌడీషీటర్‌కు రిమాండ్

భీమునిపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దిబ్బడిపాలేనికి చెందిన రౌడీషీటర్ పుక్కళ్ల కరుణ (30)ను రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తిరుమలరావు తెలిపారు. సీపీ ఆదేశాల మేరకు మంగళవారం 12 మంది రౌడీషీటర్ల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. కరుణ ఇంట్లో కిలోన్నర గంజాయి, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని, నిందితుడిపై ఆరు కేసులున్నాయని సీఐ తెలిపారు.

దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు

పెందుర్తి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారుడి నుంచి నగదు దోచుకున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ సూరిబాబు తెలిపారు. జాతీయ రహదారిపై ఆదివారం గొరపల్లి పంచాయతీ కరకవానిపాలేనికి చెందిన ఎస్.సంతోష్ బైక్‌పై వెళ్తుండగా రాంపురం జంక్షన్ వద్ద మద్య సేవించి వున్న ముగ్గురు అడ్డగించి రాళ్లతో దాడి చేశారు. రూ.2 వేలు ఇవ్వాలని లేదంటే చంపేస్తామని బెదిరించారు. తనవద్ద డబ్బులు లేవనడంతో అతడి పర్సులోని రూ.వెయ్యి లాక్కున్నారు. సంతోశ్ తన మిత్రులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. వారు వెంబడించగా ఒకరు పట్టుబడడంతో పోలీసులకు అప్పగించారు. పెందుర్తి ప్రశాంతినగర్‌కు చెందిన ఉడతా దేవేంద్రకుమార్ అలియాస్ బాలు (22), పాత పెందుర్తికి చెందిన షేక్ షాహిల్ (20), మరో బాలుడ్ని అరెస్టు చేశారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

పెందుర్తి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పాన్‌షాపు యజమానిపై దాడిచేసిన నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కృష్ణరాయపురానికి చెందిన షణ్ముఖరావు(21) మంగళవారం రాత్రి అప్పన్నపాలెంలోని పాన్‌షాపు వద్దకు వెళ్లి సిగరెట, కూల్‌డ్రింకులు తీసుకున్నాడు. డబ్బులు అడిగితే ఖాళీ సీసాతో దుకణాదారుడిపై దాడి చేశారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిని కూడా కత్తితో బెదిరించాడు. అతడ్ని అరెస్టు చేసి, హత్యాయత్నం కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

స్టాఫ్ నర్సులకు పీహెచ్‌ఎన్‌టీగా పదోన్నతులు



పదోన్నతుల ఉత్తర్వులు అందిస్తున్న ఆర్డీ రాధారాణి, తదితరులు

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో ఖాళీగా ఉన్న పీహెచ్‌ఎన్‌టీ (ట్యూటర్) పోస్టులను భర్తీ చేశారు. రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పి.రాధారాణి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో 11 పోస్టులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పది మంది హాజరై స్థానాలను ఎంపిక చేసుకున్నారు. వీరందరికీ ఎస్ఆర్‌తో కూడిన పోస్టింగ్ ఆర్డర్లను అందించారు. కౌన్సిలింగ్ ప్రక్రియలో ఏపీ నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.గంగా భవాని, జీవీఎస్ వరలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ దాసరి రాజేశ్వరితో, శ్రీకాకుళం అధ్యక్ష, కార్యదర్శులు శాంత కుమారి, త్రినాదమ్మ, కోశాధికారి సత్యవతి పాల్గొన్నారు. వివాదాలు, అవినీతి ఆరోపణలు లేకుండా పదోన్నతులు నిర్వహించడంపై అసోసియేషన్ ప్రతినిధులు హర్షం తెలిపారు.

అందని టెన్త్ మూల్యాంకన పారితోషికాలు

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన పదోతరగతి పరీక్షలు,ఆ తరువాత జవాబుపత్రాల మూల్యాంకనం విధులు నిర్వహించిన టీచర్లకు ఇంత వరకు పారితోషకం అందలేదు. 2024-25కి సంబంధించి పదోతరగతి పరీక్షలు ఈ ఏడాది మార్చిలో నిర్వహించారు. వెంటనే జవాబుపత్రాల మూల్యాంకనం చేపట్టారు. విధుల్లో సుమారు 3400 మంది పాల్గొన్నారు. పరీక్షల నిర్వహణలో ఇన్విజిలేటరుకు రోజుకు రూ.20, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్లకు రూ.40, స్క్వాడ్‌లో ఉన్నవారికి రూ.200 చొప్పున పారితోషకం ఇస్తారు. మూల్యాంనంలో పాల్గొనే టీచర్లకు మూడు రకాల విధులు ఉంటాయి. సీనియర్లను చీఫ్ ఎగ్జామినర్లగా, స్కూలు అసిస్టెంట్లను అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా, ఎస్జీటీలకు స్పెషల్ అసిస్టెంట్‌లగా విధులు అప్పగిస్తారు. అసిస్టెంట్ ఎగ్జామినర్లు రోజుకు 40 జవాబుపత్రాలను మూల్యాంకనంచేస్తే, మొత్తం మార్కులు వేసే స్పెషల్ అసిస్టెంట్‌లకు రోజుకు రూ. 300 ఇస్తారు. చీఫ్ఎగ్జామిన్లకు రోజుకు రూ.300 ఇస్తారు. గతంలో పరీక్షల నిర్వహణ,మూల్యాంకనం ముగిసి చివరి రోజునే పారితోషికం అందజేసేవారు. ఇటీవల ఆన్‌లైన్ విధానంద్వారా టీచర్ల ఖాతాలకు జమచేస్తున్నారు. అది కూడా ఏప్రిల్‌లో వేసేవారు. ఈ ఏడాది ఇంత వరకు టీచర్ల ఖాతాలకు జమచేయలేదు. మేలో సప్లిమెంటరీ పరీక్షలు, మూల్యాంకనం చేపట్టారు. దీనికి సంబంధించిన సొమ్ము ఇవ్వలేదు. ప్రభుత్వం బడ్జెట్ విడుదలచేసినా ఖాతాలకు జమకాలేదని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు తెలిపారు. విద్యాశాఖాధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

క్రైం... crime news

భవనం పైనుంచి జారి పడి పెయింటర్ మృతి



రామకృష్ణ మృతదేహం

కూర్మన్నపాలెం,ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భవనానికి పెయింటింగ్ చేస్తుండగా జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మల్కాపురం పల్లి వీధికి చెందిన ఆకుల రామకృష్ణ (53) పెయింటర్. గల్లవానిపాలెంలో బుధవారం గ్రూపుహౌస్‌కు పెయింటింగ్ చేస్తుండగా జారి పడిపోయాడు. తీవ్రంగా గాయపడడంతో అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. రామకృష్ణకు భార్య సరస్వతి, కుమారుడు లోకేష్, కుమార్తె ఉన్నారు. అతడి అన్నయ్య లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపారు.

మనస్తాపంతో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



కౌషిక్ మృతదేహం

మద్దిలపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రావడం లేదన్న మనస్తాపంతో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి. కాకినాడకు చెందిన తమ్మినేని కౌషిక్ (22) ఏయూలో కంప్యూటర్ సైన్స్ చదివాడు. తండ్రి సుధాకర్ ఏలూరు దగ్గర్లోని సిమెంట్ ఫ్యాక్టరీలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తల్లితో కలిసి కౌషిక్ నగరంలోని కేఆర్ఎం కాలనీలో ఉంటున్నాడు. అతడి సోదరుడు కెనడాలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా, కౌషిక్ 2024లో కోర్సు పూర్తి చేసి ఏడాదిగా ఖాళీగా ఉన్నాడు. ఎన్ని ప్రయత్నాలు చేసిన ఉద్యోగం రాలేదు. ఈ నెల 10న కేఆర్ఎం కాలనీలో అద్దె ఇంటిని ఖాళీ చేసి తల్లి కాకినాడ వెళ్లిపోయింది. కౌషిక్ అదేరోజు రేసపువానిపాలెంలోని ఓ హోటల్‌లో గది తీసుకొని స్నేహితులతో గడిపేందుకు వారి కోసం ఎదురుచూశాడు. వారు రాకపోవడం, ఉద్యోగ ప్రయత్నాలు విఫలమవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రతి రోజూ అతడి సోదరుడు ఫోన్ చేసి మాట్లాడేవాడు. రెండు రోజులుగా స్పందించకపోవడంతో కౌషిక్ స్నేహితులను హోటల్‌కు పంపించాడు. వారు మంగళవారం రాత్రి కౌషిక్ ఉంటున్న గదికి వెళ్లి తలుపు తట్టినా తీయలేదు. త్రీటౌన్ పోలీసులకు సమాచారమివ్వగా, వారు హోటల్‌కు చేరుకుని తలుపులు తెరిచి చూడగా కౌషిక్ విగతజీవిగా పడి ఉన్నాడు. గదిలో పురుగుల మందు సీసా లభ్యమైంది.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి కళ్లలో కారం కొట్టి చోరీ

» నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వృద్ధురాలి కంట్లో కారం కొట్టి, ఆమె చేతులకు ఉన్న బంగారు గాజులు లాక్కొని ఓ మహిళ వుడాయించింది. పోలీసులు నిందితురాలిని అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ద్వారకా సీఐ చక్రధరరావు తెలిపిన వివరాల మేరకు... లాసన్స్ బే కాలనీకి చెందిన గొట్టుముక్కల వీర వెంకట సత్యనారాయణ వర్మ కింది ఇంట్లో, మేడ పైన అతడి తల్లి (94) ఉంటున్నారు. ఈ నెల 17న మాస్క్ పెట్టుకున్న ఓ మహిళ నేరుగా ఆమె గదిలోకి వెళ్లి, కళ్లల్లో కారం కొట్టి చేతి గాజులు లాక్కొని పరారైంది. ఎస్ఐ టి.రవికుమార్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. శివాజీపాలేనికి చెందిన కుందేటి పద్మావతి (46) అప్పుడప్పుడూ ఇక్కడి వచ్చేది. మేడపై వృద్ధురాలు ఉంటున్నట్టు గమనించి చోరీకి పాల్పడింది. ఆమెను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నేరం అంగీకరించింది. ఆమె నుంచి బంగారు గాజులను స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌సీ వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు హరిప్రసాద్, జగత్‌కిరణ్, సాయిలను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

వ్యాన్‌ను ఢీకొన్న బైక్: నలుగురికి గాయాలు

ఆనందపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంభీరం ఆర్‌టీఓ కార్యాలయం రోడ్డు సమీపంలో జరిగిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. బంటుపల్లి కళ్లాలులో ఉన్న వివేకానంద జూనియర్ కళాశాల యాజమాన్యం బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలను గంభీరం శ్రీకన్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించింది. ఫంక్షన్ తరువాత ముగ్గురు విద్యార్థులు బైక్‌పై వస్తుండగా ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో విద్యార్థులతో పాటు పశ్చిమబెంగాల్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ సుమన్‌కు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మోటారు సైక్లిస్టుకు...

ఆరిలోవ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : దీనదయాళ్‌పురం సమీపంలో బుధవారం కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు గాయపడ్డాడు. ఇసుక తోటకు చెందిన బోయిన రమణ ద్విచక్ర వాహనంపై బంధువుల గృహ ప్రవేశానికి వెళ్లి వస్తుండగా జీఎస్టీ కార్యాలయం సర్వీసు రోడ్డులో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్: ఇద్దరికి గాయాలు

పెందుర్తి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి నుంచి వస్తున్న ఆటోను సరిపల్లి వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో ఆటో బోల్తాకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న కొత్తవలస గొల్లపేటకు చెందిన ఇద్దరికి తీవ్ర గాయలాయ్యాయి, డ్రైవర్, మరో ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. ట్రాక్టర్‌తో పాటు డ్రైవర్ పరారయ్యాడు.